19 . 09. 2025
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ
సంపుటి :07 సంచిక : 112 , పేజీలు : 12 వెల:రూ.5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH
తెలుగు దిన పత్రిక
www.velthuru.com
velthuru Newspaper



మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తండ్రి నలమద పురుషోత్తం రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఇతర ముఖ్య నేతలు
హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:

## జూబ్లీహిల్స్‌లో బచ్చాను పెట్టి గెలిపిస్తా



- కెటిఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్
- అసెంబ్లీ ఎన్నికలు కాదు..జూబ్లీహిల్స్ గురించిమాట్లాడు
- పార్లమెంటులో ఎన్ని సీట్లు వచ్చాయో లోకల్ బాడీలోనూ అంతే
- కెటిఆర్ విమర్శలపై భగ్గుమన్న మంత్రిపొంగులేటి



హైదరాబాద్, సెప్టెంబర్18 వెలుతురు: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తానని కెటిఆర్‌కు మంత్రి పొంగలేటి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇష్టం వచ్చినట్టుగా కాంగ్రెస్ పార్టీపై మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఎప్పటికో మూడున్నర సంవత్సరాల తర్వాత వచ్చే అసెంబ్లీ

## సీఎంతో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ



తెలంగాణ విద్యార్థులకు సహకారం ఇస్తామని హామీ

## కొడుకు పెళ్లి రిసెప్షన్ రద్దు చేసుకున్న ఎమ్మెల్యే



రైతుల సంక్షేమంకోసం 2కోట్లు ఇవ్వాలని నిర్ణయం

సీఎం రేవంత్‌ను కలిసి చెక్ అందచేసిన బత్తుల లక్ష్మారెడ్డి

## పిల్లలకు సురక్షిత నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దుతాం



యూనిసెఫ్ తో కలిసి కార్యాచరణ ప్రకటించిన మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, వెలుతురు 18 సెప్టెంబర్ 2025:

హైదరాబాద్‌లో “CLAP for Children - పిల్లల భద్రత కోసం నగర స్థాయి కార్యాచరణ ప్రణాళిక”ను తెలంగాణ ప్రభుత్వం, యూనిసెఫ్ సంయుక్తంగా ప్రారంభించింది. పిల్లలకు హైదరాబాద్ ను సురక్షిత నగరంగా మార్చుతామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క, రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. క్లాప్ ఫర్ చిల్డ్రన్ పోస్టర్ను

మిగతా2లో..

## నేపాల్ శాంతిస్థాపనకు మద్దతు

నేపాల్ ప్రధాని సుశీలా కార్కీకు మోడీ ఫోన్



## బంగ్లా చొరబాటుదారులకు అండ

- ఓట్లచోరీ ఆరోపణల వెనక ఇదే లక్ష్యం
- రాహుల్ తీరుపై మండిపడ్డ అమిత్ షా

పాట్నా, సెప్టెంబర్18 వెలుతురు: ఓట్ల చోరీ అంటూ 'ఇండియా' కూటమి తప్పుడు ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శించారు. భాజపా అధికారంలోకి



వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని గతంలో ఇదే తరహా దుష్ప్రచారం చేసిందన్నారు. బిహార్‌లోని

## పూజారుల అభిప్రాయాలకు పెద్దపీట

మరింత విశాలంగా మేడారం ప్రాంగణం

భక్తులకు మరింత సౌకర్యవంతంగా తల్లుల దర్శనం



# తరతరాలు నిలిచేలా మేడారం అభివృద్ధి పనులు



ఆదివాసీ సంస్కృతిని, విశ్వాసాన్ని, వారసత్వాన్ని, తల్లుల త్యాగాన్ని మరింత బలంగా ప్రతిబింబించేలా అభివృద్ధి పనులు

త్వరలో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

సమీక్ష సమావేశంలో ప్రకటించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరు లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18: ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ఆదివాసి జాతరగా ప్రసిద్ధి చెందిన సమ్మక్క సారలమ్మ ఆలయ ప్రాంగణం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మేడారం ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, పూజారుల అభిప్రాయాలు, ఆలోచనల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం నాడు సచివాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. సీఎం సెక్రెటరీ శ్రీనివాస రాజు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్, మేడారం సమ్మక్క సారలమ్మ పూజారులు, నిపుణులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. మేడారం జాతర నిర్వహణ, ఆలయ అభివృద్ధికి సంబంధించి పూజారుల అభిప్రాయాలను మంత్రులు తెలుసుకున్నారు. వారి ఆలోచనలు, అభిప్రాయాలు, ఆదివాసి సంప్రదాయాలకు అనుగుణంగానే ఆలయ అభివృద్ధి పనులు జరుగుతాయని మంత్రులు స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి డిజైన్లు దాదాపు ఖరారు చేశారు. సీఎం ఆమోదం తర్వాత

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



- 21న వేయి స్తంభాల గుడిలో తొలి బతుకమ్మ
- గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా సంబరాలు
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్18 వెలుతురు: బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి అని, ప్రకృతిని గౌరవించడం, ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర




## ప్రభుత్వంపై బతుకమ్మ పాటలతో విమర్శలు

- మూడు పాటలను రాయించిన బిఆర్ఎస్
- పాటలు విడుదల చేసిన కెటిఆర్

హైదరాబాద్ , సెప్టెంబర్18 వెలుతురు: ప్రభుత్వాన్ని విమర్శిస్తూ బిఆర్ఎస్ రూపొందించిన బతుకమ్మ పాటల సిడిని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు. అవన్నీ రాజకీయ పాటలే కావడం గమనార్హం. పండగపూట సర్కారును విమర్శిస్తూ ఉయ్యాల అన్న చరణంతో ఈ పాటలను వండి వార్చారు. మార్పు మార్పని వలలో మనలను ముంచిండ్రే వలలో.. అంటూ ఓ పాట.. మార్పు మార్పని మనం చేయి గుర్తుకు ఓటేస్తె అంటూ మరో పాట.. ఆరు గ్యారెంటీలు

## జిఎస్టీ సంస్కరణలు స్వాగతీస్తూ అసెంబ్లీ తీర్మానం


జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేదలకు ఎంతోమేలు

140 కోట్ల మందికి మేలు జరుగుతుంది

ఇలాంటి సాహసం కేవలం మోడీకే సాధ్యం

అసెంబ్లీలో సిఎం చంద్రబాబునాయుడు

అమరావతి,సెప్టెంబర్18 వెలుతురు: జీఎస్టీ 2.0 సంస్కరణలను స్వాగతిస్తూ ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఇది పేదలకు పెద్ద ఊరట కలిగించే అంశంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దేశంలో తొలిసారిగా జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఏపీ శాసనసభ తీర్మానం చేసిందని తెలిపారు. జీఎస్టీ 2.0 కొత్త శ్లాబుల వల్ల జరిగే ప్రయోజనాల గురించి శాసనసభ ద్వారా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. తన రాజకీయ జీవితంలో మొదటిసారి ఇలాంటి జీఎస్టీ సవరణలు చూశానని చెప్పుకొచ్చారు. గతంలో డబ్బులు లేనప్పుడు ట్యాక్స్ వేసేవారని.. దీంతో ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు, టెక్నాలజీ, సవరణలను అమలు చేయడానికి తాను ముందు ఉంటానని ఉద్ఘాటించారు. ఎవరైతే సంపద సృష్టించలేరో వారికి సంక్షేమం ఇచ్చే అర్హత లేదని



చమత్కరించారు. జీఎస్టీ స్లాబ్‌లలో మార్పు వస్తే ఇబ్బందులు వస్తాయని.. ఆదాయం తగ్గుతుందని ఆర్థిక శాఖ అధికారులు తనకు మొదట చెప్పారని గుర్తుచేశారు.

## హైదరాబాద్ బ్రాండ్‌ను కాపాడుకోవాలి



- దిశ సమావేశంలో కేద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్18 వెలుతురు: నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికీ.. లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ,

## ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు

- ఇతర రాష్ట్రాలలో ఫోన్లు ఉపయోగింపు
- ఒక రాష్ట్రం తరవాత మరో రాష్ట్రం
- కాంగ్రెస్‌కు పడే ఓట్ల జాబితా గుర్తించి చర్య
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ వివరణ



న్యూఢిల్లీ, సెప్టెంబర్18 వెలుతురు: కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల

(మొదటి పేజీ తరువాయి..)

## సిఎంతో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ

**హైదరాబాద్, సెప్టెంబర్18 వెలుతురు:**

భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు- ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు. యూకే యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్‌ను కూడా బ్రిటీష్ హైకమిషనర్‌కు సీఎం వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు ట్రైనింగ్ అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం కోరగా.. అందుకు బ్రిటీ-ష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి డిప్యూటీ- హైకమిషనర్ హైదరాబాద్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. విద్య, సాంతకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు- బ్రిటిష్ హైకమిషనర్ సీఎంకు వివరించారు. యూకే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్‌ను కో ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు అంగీకరించారు.

## కొడుకు పెళ్లి రిసిప్షన్ రద్దు చేసుకున్న ఎమ్మెల్యే

**హైదరాబాద్, సెప్టెంబర్18 వెలుతురు:**

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉదారత చాటుకున్నారు. రైతుల సంక్షేమం కోసం రెండుకోట్లు విరాళంగా ఇచ్చారు. దీనిని చెక్కు రూపంలో సిఎం రేవంత్ రెడ్డికి అందించారు. తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , ఆయన కుటుంబసభ్యులు విరాళం అందించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను లక్ష్మారెడ్డి కలిసి రూ.2కోట్ల చెక్ అందజేశారు. లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు. ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భావించారు. కానీ రిసెప్షన్‌ను రద్దు చేసుకుని ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. దీంతో వెంటనే సిఎంకు చెక్కును అందించారు. లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం అభినందించారు.

## నేపాల్ శాంతిస్థాపనకు మద్దతు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్18 వెలుతురు:**

నేపాల్‌లో శాంతి స్థాపనకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందని ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ మేరకు ప్రధాని సుశీల కార్కీకు మోడీ సందేశం పంపారు. సోషల్ మీడియాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టు-డికిన నేపాల్ లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీ తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు- మోదీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా జెన్-జీ ఎంపిక చేసింది. గత శుక్రవారం ఆమె ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కార్కీ సిఫార్సు మేరకు దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పార్లమెంటు-ను రద్దు చేశారు. 2026 మార్చి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు- ఆయన ప్రకటించారు.

## బంగ్లా చొరబాటుదారులకు అండ

డెహరీ ఆన్ సోన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఇటీవల రాహుల్ గాంధీ యాత్ర నిర్వహించారని ఆరోపించారు. ఒకవేళ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. రాష్ట్రమంతా చొరబాటు-దారులతో నిండిపోతుందని వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులను రక్షించడమే రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ.. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే బిహార్ చొరబాటు-దారులతో నిండిపోతుందని చెప్పండి. అదేవిధంగా 'ఓట్ల చోరీ' అంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేయడానికి భాజపా యత్నిస్తుందని గతంలో ఇదే తరహా ఆరోపణలు చేశారు. కానీ.. అలాంటిదేమీ జరగలేదు కదా' అని కాషాయ శ్రేణులను ఉద్దేశించి అమిత్ షా పేర్కొన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు అమిత్ షా ఈ పర్యటన చేపట్టారు. మగధ-శాహాబాద్ ప్రాంతంలోని 10 జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 2020 అసెంబ్లీ ఎన్నికలు, గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీయే పనితీరు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు- సమాచారం. అంతకుముందు సీఎం నీతీశ్ కుమార్ పాట్నాలో అమిత్ షాను కలిశారు. తాను ఎన్డీయేలోనే ఉంటానని ఇటీ-వల ప్రధాని మోదీ సమక్షంలో నీతీశ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## హైదరాబాద్ బ్రాండ్‌ను కాపాడుకోవాలి

కేంద్ర సహాయ పథకాలు, ప్రాజెక్టుల అమలు స్థితిపై గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ అంటే కేవలం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ- మాత్రమే కాదు.. నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉంది. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీ-వల వర్షాల కారణంగా నాంపల్లిలో ఇద్దరు, సంతోష్‌నగర్‌లో ఒకరు నాలాలో కొట్టు-కుపోవడం దురదృష్టకరం. ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు- అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి.. నగర ప్రాధాన్యతను గుర్తుంచుకొని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలని సూచించారు. ఏ బస్తీకి వెళ్లినా వర్షపు నీరు, వరదలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ సిస్టం దెబ్బతిని.. తాగునీటిలో కలిసిపోతోంది. అన్నీ రిస్టోర్ చేసి శుభ్రం చేయాలి. స్కూల్స్, కమ్యూనిటీ- హాళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. దిశ సమావేశంలో ఎంపి ఈటెల రాజేందర్ సహా పలువురు నేతలు, కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు సురక్షిత నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దుతాం

సచివాలయంలో గురువారం నాడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, హైదరాబాద్‌ను "పిల్లలకి సురక్షిత నగరం"గా తీర్చి దిద్దడానికి కృషి చేస్తుందని.. ఇతర నగరాలు, రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా హైదరాబాద్ ను తీర్చిదిద్దామన్నారు. ఈ ప్రయత్నంలో యూనిసెఫ్ సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. ఈ ప్రణాళిక ద్వారా ప్రభుత్వ విభాగాలు, చట్టపరమైన సంస్థలు, సమాజం కలిసి పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదగడానికి కృషి చేయనున్నారు. చట్టపరమైన సంస్థలు, ఫ్రంట్‌లైన్ సేవలను బలోపేతం చేసి, మహిళా %ం% శిశు సంక్షేమ, పోలీసు, ఆరోగ్యం, విద్య, కార్మిక, GHMC వంటి విభాగాల సమన్వయంతో బుల్లీయింగ్, ఈవ్-టీజింగ్, అసురక్షిత రవాణా, మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించడానికి చర్యలు చేపడతారు. బాలల రక్షణ సెల్‌లు, విజిలెన్స్ కమిటీల ద్వారా డేటా ఆధారిత మానిటరింగ్ జరుగుతుంది. అలాగే ఫ్రంట్‌లైన్ వర్కర్లకు, పిల్లలకు అనుకూలమైన, శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మహిలా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి అనితా రామచంద్రన్, యూనిసెఫ్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్ డా. జెలాలెం బిర్హాను టాఫెస్సే తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో బచ్చాను పెట్టి గెలిపిస్తా

ఎన్నికల గురించి కాకుండా.. త్వరలో వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల గురించి కేటీఆర్ ఆలోచించాలని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో బచ్చాగాడిని పెట్టి గెలిపిస్తా అంటూ కేటీఆర్‌కి పొంగులేటి సవాల్ విసిరారు. మూడున్నర సంవత్సరాల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా? లేదా ఫారిన్‌లో ఉంటావా? అంటూ విమర్శలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మీకు ఎన్ని సీట్లు- వచ్చాయో.. స్థానిక ఎన్నికల్లో కూడా అంతే సీట్లు- వస్తాయని పొంగులేటి వ్యాఖ్యానించారు. ఖమ్మం రూరల్ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి మళ్లీ ఎలా గెలుస్తారో చూద్దాం అని అన్న కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఎంత కష్టపడుతున్నారో అందరికీ తెలుసు. అధికారంలో ఉన్నప్పుడు వాళ్లకు కనిపించనిది, వినిపించనిది.. ప్రతిపక్షంలో కనిపిస్తుంది అంటే విడ్డూరం, హాస్యాస్పదంగా ఉంది. విభజన సమయంలో రాష్ట్రాన్ని ఇచ్చిన ప్రధాన పార్టీ కాంగ్రెస్. నాడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల పాలు చేసింది. మా ప్రభుత్వం పేదోళ్లకు సంక్షేమ పథకాలు ఇస్తుంటే కొంతమంది విషం కక్కుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే మీకు కడుపు మంట ఎందుకని పొంగులేటి అన్నారు. కమిషన్‌లు వచ్చే కాళేశ్వరం కట్టాలను కున్నారు కానీ.. పేదోడికి డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఎందుకు అనుకోలేదు. పేదోడికి ఇల్లు కట్టించి ఉంటే మీకు నేడు ఈ పరిస్థితి ఉండేది కాదు. పాముకు కోరల్లో మాత్రమే విషం ఉంటే.. మీకు ఒళ్ళంతా విషం ఉంటుంది. రెండు పర్యాయాలు మీకు బుద్ధి చెప్పారు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మీకు బుద్ధి చెప్పాలని పొంగులేటి ఫైర్ అయ్యారు. మీ కుటుంబ సమస్యను రాష్ట్ర సమస్యగా చిత్రీకరించే యత్నం చేస్తున్నారు. మీ సోదరిమణి సమస్య, మీ బిడ్డ సమస్య ను మా సీఎం రేవంత్ రెడ్డికి అంటగట్టే యత్నం చేస్తున్నారు. మొన్న ట్విట్టర్ టిల్లు ఏదో మాట్లాడుతున్నాడు. మూడున్నర సంవత్సరాల తర్వాత ఎన్నికల గురించి కాదు మాట్లాడేది.. ప్రస్తుతం ఏం జరుగుతుందో తెలుసుకో. మీ పార్టీ శాసన సభ్యులు ఆరోగ్యం బాగాలేక చనిపోయారు, దానికి 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. మీకు ఉన్న పరిజ్ఞానం, గురించి నేను మాట్లాడను. కేటీఆర్.. ముందుగా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచి చూడు. బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తా. మూడున్నర సంవత్సరాల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా, ఫారిన్ వెళ్తావా చూడాలి. జూబ్లీహిల్స్ ఎన్నిక తర్వాత మీ పార్టీ స్థానం ఏంటో చూడు నాయన ట్విట్టర్ టిల్లు. మీ దయ దాక్షిణ్యాలతో ఎవరు బిఫామ్ తీసుకోలేదు. మీ నాయన మూడు సార్లు వచ్చి ముక్కు నేలకు రాసినా ఏమి చేయలేకపోయాడు, నువ్వెంత బచ్చాగాడివి. కాంగ్రెస్ పార్టీ అంటే ఆషామాషీ పార్టీ కాదు, ఇచ్చిన మాట కోసం నిలబడి నెరవేర్చే పార్టీ. ఈ పార్టీలో ఏ ఒక్కరు తప్పు చేయరు. తల కిందులూ పెట్టిన పార్లమెంట్ ఎన్నికల్లో మీకు ఎన్ని సీట్లు- వచ్చాయో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అదే సీట్లు- వస్తాయని పొంగులేటి అన్నారు.

## ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు

నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు దిల్లీలో మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక పక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు- వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించామన్నారు. త్వరలో ఎన్నికల సంఘంపై హైడ్రోజన్ బాంబ్ పేల్చబోతున్నట్లుగా ప్రకటించినట్టుగానే గురువారం రాహుల్‌గాంధీ పేల్చారు. ఓట్ల చోరీపై గతంలో కొన్ని ఆధారాలు బయటపెట్టగా.. ఈరోజు మరిన్ని ఆధారాలను బయటపెట్టారు. మీడియా ముందు వీడియో ప్రజెంటేషన్ ఇస్తూ... ఓట్ల చోరీపై 100 శాతం ఆధారాలతో రుజువులు బయటపెడుతున్నట్లు- ప్రకటించారు. దేశ వ్యాప్తంగా లక్షలాది ఓట్లు- తొలగించాలని కొంత మంది కంకణం కట్టుకున్నారని.. దానికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే ఈసీ కళ్లప్పగించి చూస్తోందని ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో ఎన్నికలు అయిపోతే.. ఇంకొక రాష్ట్రంలో.. ఇలా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సమయానికి లక్షలాది మంది ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఇందుకోసం కేంద్రీకృత సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి.. కాంగ్రెస్ బూత్‌ల నుంచి ఓట్లు- తొలగించారని వివరించారు. ఇందుకు ప్రత్యేక ఉదాహరణగా 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు- బ్యాంక్ ఉన్న బూత్‌ల నుంచి వేలాది ఓట్లు తొలగించినట్లు- వెల్లడించారు. వేరే రాష్ట్రాల ఫోన్ నెంబర్లు, నకిలీ లాగిన్‌లు ఉపయోగించి ఓటర్ పేర్లు తొలగించారన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఉపయోగించారని స్పష్టం చేశారు. ఒక ఎన్నిక తర్వాత ఒక ఎన్నికలో.. భారతదేశం అంతటా లక్షలాది మంది ఓటర్లను.. వివిధ వర్గాలను, ప్రధానంగా ప్రతిపక్షానికి ఓటు- వేస్తున్న వర్గాలను, తొలగింపు కోసం ఒక సమూహం క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి మేము 100 శాతం రుజువును కనుగొన్నాము. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ప్రజాస్వామ్య పక్రియను ప్రేమిస్తున్నాను. నేను ఆ పక్రియను రక్షిస్తున్నాను. మీరు నిర్ణయించగల 100 శాతం రుజువు ఆధారంగా కాకుండా నేను ఇక్కడ ఏమీ చెప్పబోవడం లేదు. తీర్పు మీదేనని రాహుల్ గాంధీ అన్నారు.ర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఎవరో 6,018 ఓట్లను తొలగించడానికి ప్రయత్నించారని.. చివరికి ఎవరో పట్టుబడ్డారన్నారు. ఇది చాలా నేరాల మాదిరిగానే యాదృచ్ఛికంగా పట్టుబడినట్లు- తెలిపారు. ఈ తొలగింపు ప్రయత్నాలు కేవలం కాంగ్రెస్ పార్టీ గెలిచే బూత్‌ల్లోనే జరిగిందని వివరించారు. గోదాబాయి పేరుతో ఎవరో నకిలీ లాగిన్ సృష్టించి 12 మంది ఓటర్ల పేర్లు తొలగించారన్నారు. కానీ ఈ విషయం గోదాబాయికి తెలియదని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఫోన్ నెంబర్ల ద్వారా ఈ తతాంగం అంతా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. వారంలోపు ఈసీ డేటా విడుదల చేయాలని.. లేకపోతే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నవారిని రక్షిస్తున్నారని భావించాల్సి ఉంటుందని తెలిపారు. కర్ణాటకలోని అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ చేస్తున్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబ్ కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు. ఈ విమర్శలను ఎన్నికల సంఘం, భారతీయజనతా పార్టీ ఖండించింది. బాంబ్ తుస్సు అందని భాజపా ఎద్దేవా చేసింది.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

వ్యాప్తంగా బతుకమ్మ పండుగలో పెద్దఎత్తున పాల్గొని ప్రపంచానికి చాటి చెప్పాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ పండుగ సంబరాలు జరుగుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీన వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల ఆలయం వద్ద బతుకమ్మ సంబరాలు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. గిన్నిస్ బుక్ రికార్డులో చేరే విధంగా సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ పండుగ బాధల నుంచి పుట్టిందని చరిత్రలో ఉందని వివరించారు. కొత్తగా కవులను, రచయితలను పిలిచి వారితో చర్చించి బతుకమ్మ పాటలు పాడేలా ప్లాన్ చేస్తామని పేర్కొన్నారు. బతుకమ్మ జరిగే ప్రాంతంలో ఘనంగా ఏర్పాట్లు- చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో కూడా మన సంస్కృతి తెలిసేలా ఏర్పాట్లు- చేస్తున్నామని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రజలు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. బతుకమ్మ పండుగ చేసుకున్న తర్వాత చెరువులో వదలాలని...అందుకు తగిన ఏర్పాట్లు- చేస్తున్నామని వివరించారు. బతుకమ్మ పండుగపై అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. బతుకమ్మ పండుగ ముఖ్య ఉద్దేశం అందరూ కలిసి ఆత్మీయంగా చేసుకోవాలని. ఇది వ్యక్తుల కార్యక్రమం కాదు అందరి పండుగ అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కొందరు బతుకమ్మ పండుగను రాజకీయం చేశారని టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వివిధ రకాల పాటలతో బతుకమ్మను రాజకీయం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగ అని ఉద్ఘాటించారు. మొదటిరోజు చేసుకునే ఎంగిలి పువ్వు బతుకమ్మ దగ్గరి నుంచి చివరి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని కాంగ్రెస్ శ్రేణులు ముందుకు వెళ్లాలని సూచించారు. బతుకమ్మ పండుగపై కొన్ని అపోహలు ఉన్నాయని అన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ పండుగ.. తెలంగాణ సంప్రదాయమని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో బతుకమ్మ కుంట బతుకమ్మ కోసం మళ్లీ వచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# తరతరాలు నిలిచేలా మేడారం అభివృద్ధి పనులు

పనులు ప్రారంభం కానున్నాయి. సీఎం ఆమోదం తర్వాత ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారని శంకుస్థచేస్తారని మంత్రులు ప్రకటించారు. ప్రస్తుతం మేడారం ఆలయ ప్రాంగణంలో ఒకేసారి సుమారు 7,000 మంది భక్తులు తల్లులను దర్శించుకునే సౌకర్యం ఉంది. అయితే విస్తరణ పనులు పూర్తయ్యాక, ఆ సామర్థ్యం 10,000 మందికి పైగా పెరగనుంది. ప్రాంగణం వెడల్పు, పొడవు పెరిగి మరింత విశాలంగా మారుతుంది. దీనివల్ల పెద్ద ఎత్తున వచ్చే భక్తులు సులభంగా, వేగంగా, క్రమపద్ధతిలో దర్శనం చేసుకునే అవకాశం లభిస్తుంది. సమ్మక్క, సారలమ్మలతో పాటు అదే వరుస క్రమంలో పగిడిద రాజు, గోవిందరాజు గద్దెలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్పుతో భక్తులు ఇబ్బంది లేకుండా, సమయం వృథా కాకుండా భక్తులు ఒకే దారిలో, సాఫీగా తల్లులను దర్శించుకునే వీలు ఉంటుంది. మేడారం ఆలయ పరిసరాల్లోకి ప్రవేశించగానే ఆదివాసి ఆధ్యాత్మిక భావన కలిగేలా సాంప్రదాయ ఆర్చులు నిర్మిస్తారు. ఆలయ ప్రాంగణం చుట్టూ రాతి పిల్లర్లు, వాటిపై ఆదివాసీ కళాత్మక ఆకృతులతో, ఆదివాసీ సంస్కృతికి అద్దం పట్టేలా తీర్చిదిద్దన్నారు. తరతరాలు గుర్తుంచుకునేలా ఈ రాతి కట్టడాలు శాశ్వత చిహ్నాలుగా నిలిచిపోతాయి. అలాగే భక్తుల భద్రత దృష్ట్యా, మేడారం ప్రాంగణం చుట్టూ నాలుగు వాచ్ టవర్లు నిర్మించాలని భావిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే జాతర కాలంలో ఈ వాచ్ టవర్లు విజిలెన్స్, సెక్యూరిటీ, కంట్రోల్‌లో కీలకపాత్ర పోషించనున్నాయి. మేడారం గుడి అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి, త్వరలో సీఎం ఆమోదంతో పనులు ప్రారంభమవుతాయని మంత్రులు తెలిపారు. మేడారం అభివృద్ధి కేవలం సదుపాయాలు పెంపునకే పరిమితం కాకుండా, ఆదివాసీ సంస్కృతిని, విశ్వాసాన్ని, వారసత్వాన్ని మరింత బలంగా ప్రతిబింబించేలా రూపకల్పన జరుగుతోందని మంత్రులు స్పష్టం చేశారు. ప్రతిపాది త అభివృద్ధి పనుల పట్ల సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, ఇతర పూజారులు సంతృప్తి వ్యక్తం చేశారు. డిసెంబర్ లోపు పనులను పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## జిఎస్టీ సంస్కరణలు స్వాగతీస్తూ అసెంబ్లీ తీర్మానం

అయితే వారితో దేశమే తొలి ప్రాధానమ్యని .. దాని తర్వాతే ఆదాయమని తాను చెప్పానని అన్నారు. ముందు ఏపీ నుంచి అధికారులు వెళ్లి జీఎస్టీ 2.0 సంస్కరణలకు మద్దతు ఇవ్వాలని ఆదేశించినట్లు- చెప్పారు. ఐదు టైర్ల స్లాబ్‌ల నుంచి 2 స్లాబ్‌లకు జీఎస్టీని మార్చడం వల్ల 140 కోట్ల మందికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈసారి అన్ని పండుగలు ఘనంగా చేసుకునే అవకాశం వస్తుందని చెప్పుకొచ్చారు. గతంలో సంక్రాంతికి కానుక ఇచ్చామని... ఈరోజు జీఎస్టీ సవరణలతో 12 శాతంలో ఉన్న వారు సున్నా శాతం జీఎస్టీ కిందకు వచ్చేస్తారని తెలిపారు. కొంతమందే ఇలాంటి జీఎస్టీ సవరణలు చేయగలుగుతారని... అలాంటి వారిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందుంటారని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. 11 సంవత్సరాల్లో ప్రధాని మోదీ నిర్ణయాలు చూస్తే ట్యాక్స్ పేయర్స్ 130 శాతం మంది పెరిగారని వివరించారు. జీఎస్టీ బిల్లులు 207 శాతం పెరిగాయని... ఈరోజు రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం జీఎస్టీ ద్వారా వస్తోందని వెల్లడించారు. అన్ని రాష్ట్రప్రభుత్వాలకు జీఎస్టీ 2.0 సవరణలను వివరించిన తర్వాతనే ఆమోదించారని తెలిపారు. ఇంకా కొంచెం కష్టపడితే డబుల్ డిజిట్స్ సాధించే ఏ-కై-క దేశం భారతదేశమే అవుతుందని నొక్కిచెప్పారు సీఎం చంద్రబాబు. జీఎస్టీ వల్ల రూ.2లక్షల కోట్లు- జనరేట్ అవుతుందని వివరించారు. ఎంత ఇన్సెంటివ్స్ ఇస్తున్నామో అంత ప్రభావం జీఎస్టీ 2.0 సవరణల ఒక్క నిర్ణయం వల్ల వస్తుందని అన్నారు. ట్యాక్స్ , ఉద్యోగాలు, ఆదాయం ఇలా ఒకదానికి ఒకటి ఆధారపడి ఉండి ఆర్థిక వ్యవస్థకు బూస్ట్‌గా తయారు అవుతాయని చెప్పుకొచ్చారు. ఈ బెనిఫిట్‌ను డబుల్ ఇంజన్ సర్కార్ ఎలా ఉపయోగపడుతుందో ప్రజలకు చెప్పాలని సూచించారు. నిత్యావసరాలు చాలా వరకూ బెనిఫిట్ లభిస్తుందని పేర్కొన్నారు. కార్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు 28 నుంచి 18శాతం జీఎస్టీ తగ్గుతుందని.. దీంతో మధ్యతరగతి వారు కూడా ఏసీలు వినియోగించడానికి ముందుకు వస్తారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ప్రభుత్వంపై బతుకమ్మ పాటలతో విమర్శలు

ఉయ్యాలో ఆగమే జేసింద్రు ఉయ్యాలో ...అంటూ మరో పాటను ఈ సందర్భంగా కేటీఆర్ ఆవిష్కరించారు. బతుకమ్మ పండుగ అంటే తెలంగాణ ఆత్మ.. ఈ గడ్డకు పరిమితమైన పూల సింగిడి. ఆడబిడ్డల పండుగ.. ఈ పండగపూట పురాణ గాథలు, కథలు, రామాయణ, మహాభారత ఘట్టాలను పాటలుగా పాడుతూ ఉంటారు. తరతరాలుగా వస్తున్న పాటల మాదిరిగా రాజకీయ విమర్శలను చేస్తూ పాటలు రాసి పాడించి మరీ వాటిని ఆవిష్కరించారు. ఈ పాటలు నిజంగా బతుకమ్మ దగ్గర పాడేలాన ఉన్నాయా..? పాడుతారా..? అనేది పక్కన పెడితే బతుకమ్మ లాంటి పండుగను కూడా రాజకీయ వేదికగా వాడుకునేందుకు యత్నిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. మొన్నటి వరకు బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసింది కవితమ్మ.. బ్రాండ్ అంబాసిడర్ ఆమెనే అంటూ చెప్పిన వాళ్లు సడెన్‌గా ఇవాళ మాటమార్చేశారు. బతుకమ్మకు బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ అని పాటల విడుదల సందర్భంగా చెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బతుకమ్మ ను తెలంగాణ నుంచి వేరు చేసి రేవంత్ రెడ్డి మహిళల హృదయాలను గాయపరిచారన్నారు. ఈ నేల స్వభావం తెలిసిన పాలన మళ్ళీ రావాలని అన్నారు. పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ మూడు పాటలను స్పెషల్‌గా రాయించామని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగను గొప్పగా నిర్వహించామని చెప్పారు. కోటి మంది మహిళలను బతుకమ్మ చీరలతో గౌరవించిన నాయకుడు కేసీఆర్ అని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. తన పాలనలో ఆడపడుచులను కన్నతండ్రిలా చూసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మ మాయం చేశారంటూ విమర్శలు చేశారు. ప్రభుత్వ ఆఫీసుల్లో బతుకమ్మ ఆడుకునే అవకాశం కేసీఆర్ ఇచ్చారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు.

బతుకమ్మ పండుగ కోసం లంబాడీ ఆడబిడ్డలు ఎదురుచూస్తుంటారని మాజీ ఎంపీ మాలోత్ కవిత చెప్పారు. తెలంగాణ జాగృతి సంస్థ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు బతుకమ్మ పండుగను కల్వకుంట్ల కవిత నిర్వహించే వారు. ఇందుకోసం ప్రత్యేకంగా పాటలు సిద్ధం చేసేవారు. అందులో రాజకీయాలకు తావులేకుండా బతుకమ్మ ప్రాశస్త్యాన్ని వివరించే అంశాలే ఉండేవి. ఇప్పుడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విడుదల చేసిన బతుకమ్మ పాటలన్నీ రాజకీయ పాటలే కావడం విమర్శలకు తావిస్తోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను తాను పుట్టిన ఊరు చింతమడక ఆహ్వానించింది. ఈ నెల 21న నిర్వహించే ఎంగిలిపూల బతుకమ్మ పండుగకు రావాలంటూ గ్రామస్తులు కవితను ఆహ్వానించారు. కవితను సిద్దిపేట జిల్లా చింతమడక వాసులు ఆహ్వానించడం విశేషం. తెలంగాణ భవన్‌లో రాజకీయ పాటలను బీఆర్ఎస్ విడుదల చేయడం, కవిత చింత మడకలో బతుకమ్మ పండుగకు వెళ్తుండటం హాట్ టాపిక్‌గా మారాయి.

వెలుతురు

# సామాజిక ఉద్యమంగా సాగుతున్న వనమహోత్సవం

- జిల్లాల వారీగా టార్గెట్లపై ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ రివ్యూ
- మొక్కలు నాటి ప్రాంతాలకు జీ టాగింగు పూర్తి
- 18.03 కోట్ల మొక్కలు టార్గెట్ పెట్టుకోగా... 13.84 కోట్ల మొక్కలు ప్లాంటేషన్ పూర్తి
- రివ్యూలో పాల్గొన్న పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, అన్ని విభాగాల హెచ్ఓడీలు



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**
తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ ఆదేశాల మేరకు 2025-సంవత్సర వన మహోత్సవం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా సాగుతుంది. జిల్లాలు, డిపార్టుమెంటుల వారీగా మొక్కలు నాటడంపై గురువారం తెలంగాణ సచివాలయం, ఫారెస్టు మినిస్టర్ ఛాంబర్‌లో ఉన్నతాధికారులు రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ నిర్వహించగా, అన్ని విభాగ అధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు మొక్కలు నాటిన ప్రాంతాలకు జీయో టాగింగు పూర్తనట్టు గుర్తించారు. ఈ సంవత్సరం 18.03 కోట్ల మొక్కలు టార్గెట్ పెట్టుకోగా... 13.84 కోట్ల మొక్కలు ప్లాంటేషన్ పూర్తి చేసినట్టు వివరించారు. 77 శాతం టార్గెట్ పూర్తి చేసినట్టు స్పష్టం చేశారు. అయితే, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరిట చేపడుతున్న విషయం తెలిసిందే. అటవీ అధికారులు సిద్ధం చేసిన పీపీటీనీ ప్రిన్స్ పల్ సెక్రటరీ, పీసీసీఎఫ్ వీక్షించారు. సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని డిపార్టుమెంట్లలో ఈ మొక్కలు నాటుతున్నప్పుడు ఎదరవుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టి వచ్చింది. అయితే, గత ఏడాది అనుభవాల ఆధారంగా మరింత పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.... అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సన్నద్ధం అవ్వాలని ఆదేశించారు. ఈ సారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలని మంత్రి సురేఖ ఆదేశించిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు.

## తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగ

- పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్




**గాంధీ భవన్ వెలుతురు సెప్టెంబర్ 18:**
కాంగ్రెస్ శ్రేణులు ఎంగిలి పువ్వు నుండి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్ళాలి చాలా వరకు 2000 నుండి బతుకమ్మ ఏర్పాటు అయింది అపోహ ఉంది....కొందరు బతుకమ్మను రాజకీయం చేశారు, రకరకాల పాటలతో బతుకమ్మ ను రాజకీయం చేస్తున్నారు, ఇది తెలంగాణ పండుగ... తెలంగాణ సంప్రదాయం, బతుకమ్మ పండుగలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా జరుపుకోవాలి,బతుకమ్మ కుంట బతుకమ్మ కోసం మళ్ళీ వచ్చింది, బతుకమ్మ కుంటను కాపాడటంలో రేవంత్ రెడ్డి,హనుమంతు రావు పాత్ర కీలకం

## యూరియా వైఫల్యం కేంద్రానిది

- ప్రభుత్వంపై బురదజల్లుతున్న బిఆర్ఎస్
- మండిపడ్డట్ట మంత్రి సీతక్క

**ఖమ్మం,సెప్టెంబర్18( వెలుతురు):**
ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా, వైరా మున్సిపాలిటీలో పర్యటించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేసి బదనాం చేస్తోందని ఆరోపించారు. యూరియా సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, రైతులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ నిందలు వేస్తోందని ఆమె అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందని విమర్శించిన మంత్రి సీతక్క, తాము భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను, మహిళలకు వివిధ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరిన ఆమె, స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.

# బతుకమ్మ, దసరాకు టీజీఎస్ఆర్టీసీ 7754 ప్రత్యేక బస్సులు

**ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు స్పెషల్ సర్వీసులు**

**ప్రజలను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేలా ఏర్పాట్లు**

**టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**





బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ పండుగలకు రాష్ట్రవ్యాప్తంగా 7754 స్పెషల్ బస్సులను బస్సులను నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. అందులో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక బస్సులను నడపనుంది. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, దసరా అక్టోబర్ 2న ఉన్నందున.. ఈ నెల 27 నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది. అలాగే, తిరుగు ప్రయాణానికి సంబంధించి అక్టోబర్ 5, 6వ తేదిల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులను సంస్థ ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్ లో ప్రధాన బస్టాండ్లైన ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్ తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్ బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్ సుఖ్ నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడిపించనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఈ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. దసరా స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరించనుంది. ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదివరకు వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6 వ తేదిల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే సవరణ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యూలర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. అవి యధావిధిగా ఉంటాయి. "బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి సంస్థ సంసిద్ధంగా ఉంది. గత దసరా కంటే ఈ సారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్ లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్ నగర్, తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కూర్చీలు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారు. పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుంటోంది." అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి.. ఇబ్బందులు పడొద్దని ఆయన సూచించారు. టీజీఎస్ఆర్టీసీలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ ను సంస్థ అధికారిక వెబ్ సైట్ tgsrtcbus.in లో చేసుకోవాలని కోరారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు.

# ప్రధాన్ మంత్రి స్వనిధి పథకం కింద "లోక్ కళ్యాణ్ మేళాలు"

- మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**
స్ట్రీట్ వెండర్స్ ఈ పథకాన్ని ఉపయోగించుకొని రుణాలు పొందవచ్చు.. ఆర్థిక వృద్ధి సాధించవచ్చు..దపట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన మిషన్, పట్టణ పరిపాలన శాఖ, తెలంగాణ ప్రభుత్వం (Mission for Elimination of poverty in Municipal Areas, Municipal Administration Department, Telangana Government) జీహెచ్ఎంసీ సహా అన్ని పట్టణ స్థానిక సంస్థల (ULBs) బోర్డు మరియు MCSలు (కొత్తగా ఏర్పడిన ULBలను మినహాయించి) 2025 సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రధాన్ మంత్రి స్వనిధి (PM SVANidhi) పథకం కింద "లోక్ కళ్యాణ్ మేళాలు" నిర్వహించాలని సర్క్యులర్ జారీచేయడమైనది. కేంద్ర మంత్రివర్గం ఇటీవలే ప్రధాన్ మంత్రి స్వనిధి (PM SVANidhi) పథకాన్ని పునర్వ్యవస్థీకరించి, 2030 మార్చి వరకు పొడిగించడం ఆమోదించింది. అదనంగా, 2025 సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం ("లోక్ కళ్యాణ్ మేళాలు") నిర్వహించనున్నట్టు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MoHUA) తెలిపింది. ఇవి అన్ని పట్టణ స్థానిక సంస్థల (ULBs) పరిధిలో జరుగుతాయి. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MoHUA) ఇచ్చిన వివరాల ప్రకారం, ఈ పథకం కింద 2020 నుండి 2025 సెప్టెంబర్ వరకు తెలంగాణ లో 95,378 స్ట్రీట్ వెండర్స్ కి



164.21 కోట్ల రూపాయల రుణం లభించింది. తెలంగాణలో, ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా 21,313 మంది స్ట్రీట్ వెండర్స్ కి రుణ సహాయం అందించాలని టార్గెట్ నిర్దేశించడం జరిగింది. దీని ఉద్దేశ్యం వీధి వ్యాపారులు మరియు వారి కుటుంబాలకు ఆర్థిక సహకారం, డిజిటల్ వినియోగం ప్రోత్సాహం, శిక్షణ, సామాజిక-ఆర్థిక అభివృద్ధి కల్పించడం.

**ప్రత్యేక ప్రచార ప్రధాన లక్ష్యాలు:**

- పునర్వ్యవస్థీకరించిన PM SVANidhi పథకం కింద కొత్త దరఖాస్తులను స్వీకరించడం
- ఇప్పటికే మంజూరు అయిన దరఖాస్తులకు రుణాల పంపిణీ సులభతరం చేయడం
- "Returned by Bank" వర్గంలో ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడం
- బ్యాంకుల వద్ద మంజూరు కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయడం
- క్రియాశీలం కాని లబ్ధిదారులను డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేయించడం
- వీధి ఆహార విక్రేతలకు FSSAI సమన్వయంతో శిక్షణ ఇవ్వడం
- లబ్ధి పొందని వీధి వ్యాపారులు మరియు వారి కుటుంబాల సామాజిక-ఆర్థిక ప్రొఫైలింగ్ చేసి, రుణ మంజూరు చేయడం

**అమలు విధానం:**
ఈ ప్రచారాన్ని బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ ఏగ్రిగేటర్లు (DPAs), టౌన్ వెండింగ్ కమిటీలు, FSSAI, సంబంధిత శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విక్రేత సంఘాలతో సమన్వయం చేసుకుంటూ అమలు చేయనున్నారు. ప్రచారం సమయంలో పథకంలోని కొత్త అంశాలను ప్రజలకు, లబ్ధిదారులకు IEC ప్రచారం ద్వారా విస్తృతంగా తెలియజేయనున్నారు. అలాగే ప్రతి ULB స్థాయిలో దరఖాస్తుల స్వీకరణ, రుణాల పంపిణీ, క్రియాశీలం కాని లబ్ధిదారుల డిజిటల్ ఆన్‌బోర్డింగ్, శిక్షణ కార్యక్రమాలు, వీధి వ్యాపారుల సామాజిక-ఆర్థిక ప్రొఫైలింగ్ వంటి అంశాలకు సంబంధించిన లక్ష్యాలను నిర్ధారించారు. ఈ మేళాల ఉద్దేశ్యం వీధి వ్యాపారులకు రుణ సౌకర్యాలు అందించడం, డిజిటల్ సాధికారతను ప్రోత్సహించడం, శిక్షణ కల్పించడం మరియు సామాజిక-ఆర్థిక సంక్షేమ పథకాలతో అనుసంధానం చేయడం.

## హైదరాబాద్ లో మరోసారి భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

- హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**
హైదరాబాద్ లో మరోసారి భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్ ,విద్యుత్ వివిధ విభాగాల అధికారులు సమన్వయం



చేసుకోవాలని సూచించారు. 3 రోజుల్లో పడాల్సిన వర్షం 30 నిమిషాల్లోనే తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కుంభవృష్టి పడుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అత్యసరమైతేనే ప్రజలు ఇళ్లలో నుండి బయటకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుతున్న ప్రాంతాల్లో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్ ,ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఎక్కడ ఇబ్బందులు ఉన్న వెంటనే స్పందించాలని తెలిపారు. మ్యాన్ హోల్ వద్ద జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.



# సంపాదకీయం..

# అసెంబ్లీకి రానినేతలు అవసరమా ?



తెలుగు రాష్ట్రాల్లో చాలా విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అధికారం కోల్పోవడంతో విమర్శలే లక్ష్యంగా విపక్షంలో ఉన్న పార్టీలు వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షహోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని ఎపిలో విపక్ష వైకాపా అధినేత జగన్ మొండిపట్టుతో ఉన్నారు. విపక్ష హోదా ఇవ్వండి అసెంబ్లీకి వస్తానని అంటున్నారు. ఇక తెలంగాణలో విపక్ష హోదా ఉన్నా కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదు. అధికారం ఉంటే తప్ప అసెంబ్లీలో అడుగు పెట్టేది లేదన్న ధోరణిలో ఉన్నారు. ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న తరవాత అసెంబ్లీకి రావాల్సిందే. సమస్యలపై చర్చించాల్సిందే. అలా కాకండా జీతభత్యాలు మాత్రం ఠంచనుగా ఎత్తుకుంటున్నారు. ప్రజల సొమ్ము తింటున్న ఈ ఇద్దరు నేతలు ఇంత బాధ్యతారహితంగా ఉంటున్నారు. ఇలాంటి సమయాల్లో చట్టప్రకారం ఏం చేయాలన్నది ఆలోచన చేయాలి. ఇలాంటి వారిపై కొరడా ఝులిపిం చాలి. వారిని ఎమ్మెల్యేలుగా అనర్హులను చేయాలి. మళ్లీ ఎన్నుకోకుండా చూడాలి. ఇకపోతే అధికారంలో ఉండగా అప్పులు చేసి, విభజిత ఆంధ్రప్రదేశ్‌ను ఈ ఇద్దరూ కలిసి అప్పుల ఊబిలోకి నెట్టారు. ఇప్పుడేమో ఉన్న ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. నిజానికి వీరు ఎందుకు అప్పులు చేశారు.. ఎందుకు దివాళా తీయించారన్న దానికి సమాధానం లేదు. దేశంలో బహుశా ఇంతగా అప్పుల బారినపడ్డ రాష్ట్రాలు లేవేమో. అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణను పాటించలేదు. దీంతో ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ అనుత్పాదక రంగాలకు విపరీతంగా దుబారా చేసారు. వీటినే అభివృద్ధి, సంక్షేమం అంటూ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకునే పనిలో ఉన్నాయి. ఆర్థిక క్రమశిక్షణతో పాటు, రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టి కరచిపోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ప్రధానంగా అభివృద్ధి పేరుతో చేస్తున్న డబ్బు పందేరాలు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. ఈ అప్పుల నుంచి బయటపడే మార్గాలు కూడా కనిపించడం లేదు. అలాగే అభవృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో విపక్షాలను దెబ్బతీయడం, విమర్శలను సహించక పోవడం వంటి చర్యలతో ఇద్దరు సిఎంలు నిరంకుశంగా పనిచేయడం ద్వారా తెలుగు రాష్ట్రాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాంటి రాష్ట్రాలను గాడిలో పెట్టాల్సిన ప్రస్తుత సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు మరిన్ని అప్పులు చేస్తున్నారే తప్ప ఆలోచన చేయడం లేదు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ప్రజల్లో పలచన అయి, అధికారం కోల్పోయి, అసెంబ్లీకి రానని మంకు పట్టుతో ఉన్నారు. పార్టీలను అణగదొక్కడంలో కెసిఆర్ చేసిన కృషి ఇప్పుడు ఆయనకే ఎదురు తిరిగింది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేయాలన్న కుట్రతో చేసిన ప్రయత్నాలు బెడిసి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా చేశారు. దీంతో ఆయనా అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారు. కాంగ్రెస్, బిజెపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఫలించలేదు. వారి దెబ్బకు బిఆర్‌ఎస్ ఉనికిలేకుండా పోయింది. ఇలాంటి రాజకీయ నేతలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచనచేయాలి. నిజాయితీ లేని రాజకీయ నేతలను పక్కన పెట్టడం నేర్చుకోవాలి. అసెంబ్లీకి రాని నేతలు ప్రజలకు ఏం సేవ చేస్తారో చూస్తున్నాం. అధికారంలో ఉన్నా మేలు చేయలేదు. విపక్షంలో ఉన్నా మేలు లేదని కెసిఆర్, జగన్‌లు నిరూపించారు. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను,ఆకాంక్షలను పట్టించుకోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా ఇప్పుడు అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. బిజెపి అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరాశా నిస్పృహలతో ఉన్న మమతా బెనర్జీ బిజెపి నేతలపై దాడులకు దిగుతోంది. ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల మనసెరిగి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. తెలంగాణల కూడా తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీసిన కేసీఆర్, ఇప్పుడు ప్రతిపక్ష పాత్రకే పరిమితం అయ్యారు. ఇలాంటి దుస్తితి ఎదుర్కోవాల్సి వస్తుందిన ఊహించి ఉండక పోవచ్చు. పశ్చిమబెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఏ తప్పు చేశారో తెలంగాణలో కూడా కేసీఆర్ అదే తప్పు చేసారు. పశ్చిమ బెంగాల్‌లో బలంగా ఉన్న వామపక్షాలను మమతా బెనర్జీ బలహీనపరిచారు. ఎపిలో కూడా జగన్ టిడిపిని తిట్టడం,కేసులు పెట్టడం, లేపేయడం వంటి చర్యలకు ప్రోత్సాహం ఇవ్వండం తో ప్రజలు తిరిగి టిడిపిని ఎన్నుకున్నారు. ప్రజలు మెచ్చేలా పాలన అందించినంతవరకు పాలక పార్టీకి దిగులు లేదు. అయితే ఇది విస్మరించి వ్యహరించడంవల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జగన్, కెసిఆర్‌లు గడ్డు పరిస్థితులను ఎదుర్కొం టున్నారు. వారు అసెంబ్లీకి వచ్చి తమ హయాంలో మంచిచేస్తే మంచిని చెప్పాలి. విపక్షంగా ప్రజల పక్షాన పోరాడాలి. సమస్యలపై నిలదీయాలి. కానీ అధికార పక్షం ఎదురుదాడిని తట్టుకోలేక భయంతో అసెంబ్లీకి ముఖం చటేస్తున్నారు. ఇప్పుడు భారతీయ జనతాపార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది. బీజేపీ ఇంతలా బలం పుంజుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించడంలేదు. బిఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వా మ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్టుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. అసెంబ్లీకి వెళ్లకుంటే నష్టపోయేది జగన్, కెసిఆర్‌లు మాత్రమేనని గుర్తించాలి.

## తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

**- యూరియా సరఫరాలో నిర్లక్ష్యం**

**- కేంద్రమాజీమంత్రి వేణుగోపాలాచారి**



**ఆదిలాబాద్,సెప్టెంబర్18( వెలుతురు):** యూరియా విషయంలో స్పష్టత లేని కేంద్రం, రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం వహించిందని మాజీకేంద్రమంత్రి, కాంగ్రెస్ నేత డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. రాష్ట్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రకటన చేయలేదన్నారు. దీనికితోడు రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, మంత్రులు అనవసరంగా నోరు పారేసుకోవడం సరికాదన్నారు. ఇకపోతే కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపైన, హామీలపైన స్పష్టత ఇవ్వడంలో విఫలమైన కేంద్రంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. యూరియాపై ఎందుకు స్పష్టత ఇవ్వరని అన్నారు. ఇప్పుడు దేశంలో ఆహర కొరతకు, ధాన్యం రేట్లు పెరగడానికి కారణం ఎవరని అన్నారు. తెలంగాణ పండించిన ధాన్యాన్ని బేషరతుగా కొనివుంటే ఇవాళ ఇంతటి సంక్షోభం వచ్చి ఉండేది కాదన్నారు. ఇంతకాలం తాము సంయమనంతో వ్యవహరించామని అన్నారు. తమ ఎంపిలు పార్లమెంటులో పోరాడినా లాభం లేకుండా పోయిందన్నారు. కేంద్రం నీతి ఆయోగ్ ఏర్పాటు చేసినప్పుడు చేసిన ప్రకటనలకు తాజాగా అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేకుండా ఉందన్నారు. నిధుల విడుదలలో తెలంగాణకు అన్యాయం జరుగు తోందన్నారు. బిజెపి ఎంపిలు కూడా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. తెలంగాణలో హుంకరిస్తున్న నేతలు ఈ నేలకు ఏంచేశారో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని వారు గుర్తించాలన్నారు. అనేక విషయాల్లో కేంద్రం తెలంగాణపై చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఈ సమస్య తెలంగాణకు సంబంధించిందే కాదని.. దాదాపు చాలా రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. ఆర్థిక సంఘం బకాయిలు, గ్రామీణాభివృద్ధి నిధులు తక్షణమే విడుదల చేయాలని కొత్త ప్రభాకర్ రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని సూచించారు.

**(ఆధ్యాత్మిక చింతన )**

## కాకులకే ఎందుకు పిండం పెట్టాలి ?

**తిరుమల,సెప్టెంబర్18( వెలుతురు):**



మహాలయంలో అంటే పితృపక్షాల సమయంలో మనం కాకులకు ఆహారం ఎందుకు పెడతాము? మన పూర్వీకులు కాకులుగా మారారా? అయితే ఇంతటి అల్ప పక్షిగా ఎందుకు మారారు? ఏదైనా పెద్ద స్థాయిలో ఉన్న పక్షిగా ఎందుకు మారలేదు?'అని భక్తుడొకరు పరమాచార్య స్వామివారిని అడిగాడు. స్వామివారు ఒకసారి చిరునవ్వి, 'తమిళంలో మనం కాకిని 'కాకా' అని పిలుస్తాము. ఇక ఏదైనా ప్రాణిని మనం అవి చేసే శబ్దాలతో పిలుస్తామా? పిల్లిని 'మ్యావ్' అని, చిలుకలు కికి అంటాయి కాబట్టి వాటిని 'కికి' అని పిలుస్తామా? లేదు! కాకిని దాని అరుపుతో పిలుస్తాము. అదే దాని ప్రత్యేకత. క అంటే కాపాత్తు (కాపాడు), రక్షించు అని అర్థం. కనుక నువ్వు కాకికి ఆహారం పెట్టి 'కా కా' అని పిలిస్తే, కాపాడు అని పితృదేవతలని అడిగినట్టు!విరివిగా ఉంటాయి, ఏది పడితే అది తింటాయి కాబాట్టి కాకిని నువ్వు అల్పపక్షి అంటున్నావు. కాకి ఎంత గొప్పదో ఇప్పుడు చెబుతాను విను. అది బ్రహ్మముహూర్తంలో లేస్తుంది. కా కా అని అరచి నిన్ను నిద్రలేపుతుంది. ఒక్కోసారి కోళు ్ళ సరిగ్గా సమయానికి లేవవు. కాని కాకి సరైన సమయానికి లేస్తుంది. అది కాకా అని అరుస్తూ నీ జపానికి సరైన సమయమైన బ్రహ్మముహూర్తంలో నిన్ను నిద్రలేపుతుంది.అది పూజకు సరైన నిర్దేశం. అంతేకాక, దానికి ఆహారం దొరికితే ఇతర కాకులను పిలుస్తుంది. ఆహారాన్ని పంచుకుని తినండి అని మనకు తెలిపే వేరే ప్రాణుల్లో కనపడని ఒక ప్రత్యేకక లక్షణం కలిగినది. మరలా సాయంత్రం నిద్రకు ఉపక్రమించే ముందు, మరలా కాకా అని అంటుంది. ఆ రోజు జరిగిన అన్ని విషయాలకు భగవంతునికి కృతజ్ఞతగా. అలాగే, కాకులు సూర్యాస్తమయం తరువాత ఏమీ తినవు. ఇది శాస్త్రములు చెప్పిన ఉత్తమమైన విషయం కూడా. ఇది ఎంతమంది పాటిస్తున్నారు?కనుక నాకు తెలిసి కాకి అల్ప ప్రాణి కాదు. అది మనకు ఎంతో నేర్పుతుంది. అందుకే పిత్ర దేవతలు కాకి రూపంలో వస్తారు. మరొక్క విషయం.. కేవలం మహాలయం లోనే కాదు, ప్రతిరోజూ కాకికి ఆహారం పెట్టు. కాకి మనకు అద్వైతాన్ని కూడా నేర్పుతుంది.నువ్వు పెట్టిన ఆహారాన్ని చూడగానే కాకి ఎంతో సంతోషపడి ఆ ఆహారాన్ని స్వీకరిస్తుంది. అది తినడం చూడడం వల్ల నువ్వు కూడా ఆనందాన్ని పొందుతావు. కనుక ఇరువురు ఆనందంగా ఉంటారు. ఇద్దరూ భగవత్ స్వరూపులే! అని తెలిపారు.

## విద్య ఉంది... ఉద్యోగం లేదు..

# యువతకు ఎదురైన సవాళ్లు..!



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

భారతదేశం ప్రపంచంలో అత్యంత జనసంఖ్య కలిగిన దేశాలలో ఒకటిగా ఉంది. ఈ దేశానికి ప్రత్యేకత ఏమిటంటే, యువజనాభా శాతం ఇతర దేశాలతో పోలిస్తే అత్యధికంగా ఉంది. దీనిని చాలా మంది ఆర్థికవేత్తలు ఒక అవకాశంగా కూడా అభివర్ణించారు. ఎందుకంటే యువత అంటే ఉత్సాహం, సృజనాత్మకత, కొత్త ఆవిష్కరణలు. ఒక దేశానికి బలమైన శక్తి కావాలంటే అది యువత రూపంలోనే లభిస్తుంది. కానీ భారతదేశానికి ఈ వరం ఒక శాపంలా మారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎందుకంటే యువతకు సరైన ఉపాధి అవకాశాలు లభించడం లేదు. విద్యను పూర్తి చేసినా ఉద్యోగం దొరకడం లేదు. ఉపాధి కోసం పోరాడుతూ చాలా మంది యువకులు తమ కలలు కోల్పోతున్నారు. నిరుద్యోగం పెరగడం కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, ఇది సమాజం మొత్తానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఒక పెద్ద అడ్డుగోడ.ప్రపంచ బ్యాంక్ నివేదికలు కూడా చెబుతున్నాయి. భారతదేశంలో జనాభా పెరుగుతున్న వేగం, ఉద్యోగాల పెరుగుతున్న రేటుతో సరిపోలడం లేదు. ఈ వ్యత్యాసం వల్ల లక్షల మంది యువత నిరుద్యోగులుగా మారుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఒకప్పుడు వ్యవసాయం గ్రామీణ భారతదేశానికి ఉపాధి ప్రధాన వనరుగా ఉండేది. కానీ ఇప్పుడు ఆధునిక యంత్రాలు వ్యవసాయ పనులను భర్తీ చేశాయి. దీని వల్ల మానవశక్తి అవసరం తగ్గిపోయింది. రైతులు తక్కువ మంది పనివారితోనే వ్యవసాయం పూర్తి చేస్తున్నారు. కాబట్టి వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో గ్రామీణ యువతకు ఉపాధి దొరకకపోవడం సహజమైంది.

ఈ పరిస్థితి మరో సమస్యను తెచ్చింది. అదే పట్టణాలకు వలస. గ్రామాల్లో స్థిరమైన ఉపాధి దొరకక యువత నగరాలకు వెళ్లిపోతున్నారు. అక్కడ ఉద్యోగాలు ఉన్నా పరిమితమే. కానీ వలస వెళ్ళే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. దీనివల్ల పట్టణాల్లో పోటీ తీవ్రతరం అవుతుంది. ఒక ఉద్యోగానికి వందలాది మంది దరఖాస్తు చేస్తున్నారు. మరోవైపు పట్టణాల్లో వలస కారణంగా నివాస సమస్య, దారిద్ర్యం, అనధికారిక కూలి పనుల పెరుగుదల కనిపిస్తోంది. ఇది పట్టణాల సామాజిక సమతుల్యతను దెబ్బతీస్తోంది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిస్థితిని పరిశీలించినా దాదాపు ఇదే ధోరణి కనబడుతోంది. తెలంగాణలో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వేలాది మంది నిరుద్యోగులుగా ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక నివేదికలు చెబుతున్నాయి, ప్రతి సంవత్సరం లక్షల సంఖ్యలో నిరుద్యోగ దరఖాస్తులు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మికులు, చిన్నచిన్న కూలీలు ఉద్యోగం కోసం ఇతర రాష్ట్రాలకు కూడా వలస వెళ్తున్నారు. కాని పట్టణాల్లో అవకాశాలు పరిమితంగానే ఉన్నందున వారు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చర్యలు చేపట్టాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA) అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 100 రోజులపాటు ఉపాధి లభించేలా చేస్తారు. ఇది కొంతవరకు ఉపశమనంగా ఉన్నా, స్థిరమైన పరిష్కారం కాదు. అదే విధంగా యువత కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కూడా ప్రారంభించారు. "స్కిల్ ఇండియా", "ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన", "డిజిటల్ ఇండియా" వంటి పథకాలు యువతను మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా




పెట్టుకున్నాయి.
అలాగే ప్రభుత్వాలు జాబ్ మేళాలను కూడా నిర్వహిస్తున్నాయి. కానీ ఇవి ఎక్కువగా ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాలకే పరిమితమయ్యాయి. అందువల్ల సాధారణ విద్యార్హతలున్న యువతకు వీటిలో పెద్దగా లాభం లేదు. తెలంగాణలో ప్రభుత్వం కొంతకాలం క్రితం "టాస్క్" (Telangana Academy for Skill and Knowledge) అనే సంస్థను ప్రారంభించింది. దీని ద్వారా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుచేశారు. కానీ అమలు స్థాయిలో వీటి ప్రభావం పరిమితంగానే ఉంది.ప్రైవేట్ రంగం ప్రస్తుతం ఉపాధి అవకాశాల ప్రధాన వనరుగా మారింది. ముఖ్యంగా ఐటీ రంగంలో హైదరాబాద్, బెంగళూరు, పూణే, చెన్నై వంటి నగరాలు అభివృద్ధి చెందాయి. కానీ ఈ రంగాల్లోనూ సమస్యలున్నాయి. ఉద్యోగ భద్రత తక్కువ. వేతనాలు కూడా కొత్తగా చేరే వారికి తక్కువగానే ఉంటాయి. ఆర్థిక మాంద్యం వచ్చినప్పుడు తొలగింపులు ఎక్కువగా జరుగుతాయి. ఉదాహరణకు కోవిడ్ మహమ్మారి సమయంలో లక్షలాది మంది ప్రైవేట్ ఉద్యోగులు ఒక్కసారిగా నిరుద్యోగులయ్యారు. ఇది యువత భవిష్యత్‌పై అనిశ్చితి పెంచింది.చిన్న, సూక్ష్మ, మధ్య తరగతి వ్యాపారాలు (MSME) కూడా ఉద్యోగాల ప్రధాన వనరుగా ఉంటాయి. కానీ ఈ రంగానికి సరైన మద్దతు లభించడం లేదు. రుణాలు, పెట్టుబడులు అందక చాలా యూనిట్లు మూతపడుతున్నాయి. కోవిడ్ సమయంలో ఈ రంగం దెబ్బతినడంతో నిరుద్యోగం మరింత పెరిగింది. ఒకవైపు రైతులు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు చిన్న వ్యాపారులు కూడా నష్టాల్లో ఉన్నారు. ఫలితంగా ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గాయి.

విద్యా వ్యవస్థలోని లోపాలు కూడా నిరుద్యోగానికి ప్రధాన కారణం. మనం ఇప్పటికీ సర్టిఫికెట్ ఆధారిత విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నాం. కానీ మార్కెట్ మాత్రం నైపుణ్యాలను కోరుతోంది. ఇంజనీరింగ్, మేనేజ్మెంట్, సైన్స్ విద్యార్థులు వేలాదిగా కాలేజీల నుంచి బయటకు వస్తున్నారు. కానీ వారిలో చాలా మందికి పరిశ్రమలకు కావలసిన ప్రాక్టికల్ స్కిల్స్ ఉండవు. దీని వల్ల డిగ్రీలు ఉన్నా ఉద్యోగాలు దొరకవు. మరోవైపు టెక్నికల్ రంగంలో అవసరమైన వర్క్ ఫోర్స్ కొరతగా ఉంటుంది. అంటే విద్యా వ్యవస్థ, పరిశ్రమ అవసరాల మధ్య గ్యాప్ పెరుగుతోంది.ఈ గ్యాప్‌ను తగ్గించేందుకు ఇటీవల ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉదాహరణకు తెలంగాణలో ప్రతి జిల్లాలో స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే స్టార్టప్‌లకు మద్దతు పథకాలు కూడా తీసుకొచ్చారు. యువత వ్యాపార ఆలోచనలు కలిగినప్పుడు వాటిని ప్రోత్సహించేందుకు నిధులు, సబ్సిడీలు ఇవ్వడం జరుగుతోంది. కానీ వీటిని ఉపయోగించుకునే స్థితి ఉన్నవారు మాత్రమే ప్రయోజనం పొందుతున్నారు. గ్రామీణ యువత, పేద వర్గాల వారికి ఇవి అందడం లేదు.దీని వల్ల మరో సమస్య వస్తోంది. అదే వలస. ప్రతి సంవత్సరం లక్షలాది మంది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. నిర్మాణ రంగం, గృహ సేవలు, హోటల్ పరిశ్రమల్లో తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారు. ఇది దేశానికి పెద్ద మానవ వనరుల నష్టమే. ఎందుకంటే విద్యావంతులు, కష్టపడే యువకులు దేశం విడిచి వెళ్లిపోతున్నారు.నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలంటే సమగ్ర దిశా ప్రణాళిక అవసరం. విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చాలి. ప్రాథమిక స్థాయిలోనే వృత్తిపరమైన శిక్షణలు అందించాలి. విద్యార్థులు చదువుకుంటూనే ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు నేర్చుకోవాలి. పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి పనిచేయాలి. ఒకవైపు ప్రభుత్వం MSME రంగానికి రుణాలు, సబ్సిడీలు ఇవ్వాలి. మరోవైపు స్టార్టప్‌లను గ్రామీణ స్థాయిలో కూడా ప్రోత్సహించాలి.ప్రభుత్వ ఉద్యోగాలు కూడా ఖాళీగా ఉన్నవి భర్తీ చేయాలి. ప్రతి సంవత్సరం లక్షల ఖాళీలు ఉన్నా, నియామక ప్రక్రియలు ఆలస్యం అవుతున్నాయి. దీని వల్ల యువతలో నిరాశ పెరుగుతోంది. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోతే, మరోవైపు ప్రైవేట్ రంగం భరోసా ఇవ్వడం లేదు. కాబట్టి ప్రభుత్వమే ముందడుగు వేసి ఉద్యోగాలను సృష్టించాలి.భవిష్యత్తులో డిజిటల్ రంగం, పునరుత్పాదక శక్తి రంగం, హెల్త్‌కేర్ రంగంలో ఉద్యోగాలు పెరిగే అవకాశం ఉంది. వీటికి యువతను సిద్ధం చేయాలి. ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి, అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ ఇవ్వాలి. అలా చేస్తే భారత యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి.ఇప్పటికైనా ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి సమన్వయం కలిగిన ప్రణాళికలు రూపొందించాలి. నిరుద్యోగం ఒకరోజులో పోయేది కాదు. కానీ దీని పరిష్కారం కోసం దశలవారీ చర్యలు తీసుకుంటే మాత్రం ఖచ్చితంగా ఫలితాలు కనిపిస్తాయి. యువతకు ఉపాధి దొరికితే, వారి భవిష్యత్తు మెరుగవుతుంది. అదే సమయంలో దేశ ఆర్థికవ్యవస్థ కూడా బలపడుతుంది. యువశక్తి సరైన దిశలో ప్రయాణిస్తే భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడం సాధ్యం. లేకపోతే నిరుద్యోగం దేశానికి అడ్డుగోడగానే మిగిలిపోతుంది.

## ఎలాంటి అనుమతులు లేకుండా కాలేజీలు నడుపుతూ విద్యార్థులపై దాడులు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**
హైదరాబాద్‌లోని గడ్డి అన్నారం నారాయణ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ విద్యార్థిపై ఫ్లోర్ ఇంచార్జ్ దాడి చేయగా దవడ ఎముక విరిగిందని దీనికి నారాయణ కాలేజీ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.ఇలాంటి దారుణ ఘటనలు చోటు చేసుకోవడం కార్పొరేట్ విద్యాసంస్థల్లో నిత్యకృత్యమయ్యాయని అన్నారు.గ్రేటర్ హైదరాబాదు పరిధిలో అనుమతులు లేకుండా ఎన్నో జూనియర్ కాలేజీలు నడుస్తున్నాయని కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు ఇచ్చే డబ్బులకు ఆశపడి ఇంటర్మీడియట్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క మాదాపూర్ ప్రాంతంలోనే రెండు కాలేజీలకు అనుమతులు తీసుకొని ఏకంగా 20 కాలేజీలు నడుపుతున్నారని అన్నారు.

## కాచిగూడ, ఓయూ ట్రాఫిక్ సీఐలకు ఘన సన్మానం..

**వెలుతురు, హైదరాబాద్ సెప్టెంబర్ 18 :**
కాచిగూడ, ఓయూ సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించిన ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ లకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఇటీవల బదిలీ అయిన కాచిగూడ సీఐ శ్రీనివాస్, ఓయూ సిటీ ట్రాఫిక్ సీఐ సుధాకర్ రావులకు.. వారి, వారి పోలీస్ స్టేషన్ లో వేరు వేరుగా ట్రాఫిక్ ఎస్ఐ, సిబ్బంది ఘన సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడుతూ సన్మానించారు. ప్రజల రోజువారీ సమస్యలను పరిష్కరిస్తూ మంచి సిఐలుగా పేరు తెచ్చుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో అందరూ పాల్గొని వీడ్కోలు పలికారు.





## ఆదర్శనగర్ బస్తీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన బస్తీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**
హిమాయత్ నగర్ లోని ఆదర్శ బస్తీలో వర్షాలు కురిసినప్పుడు వర్షం నీరు నాలాలో కలవడానికి ఏర్పాటు చేసిన పైప్లైన్ పనిని ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు నాలాలో కలవడం కోసం ఏర్పాటు చేసిన పైప్ లైన్ లో పనులను పర్యవేక్షించడానికి వెళ్లి బస్తీ వాసులతో కలిసి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకుని డి ఈ ప్రవీణ్ ఏఈ పవన్ వర్క్ ఇన్స్పెక్టర్ రాము తో కలిసి కాంట్రాక్టర్ చేసిన చిన్నచిన్న తప్పులను వారి దృష్టికి తీసుకువెళ్లి వాటిని సరిచేసి వరద నీటిని తగ్గించడానికి త్వరలో వర్షాలు తగ్గిన తర్వాత జోనల్ కమిషనర్ రవి కిరణ్ చెప్పిన విధంగా అక్కడ పంపు సిస్టం ని ఏర్పాటు చేయాల్సిందిగా చెప్పి ఈ సమస్య పరిష్కారం కోసం ఇంత డబ్బులు వెచ్చించి క్వాలిటీ విషయంలో సక్రమమైన చర్యలు తీసుకొనకపోతే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కాంట్రాక్టర్ కి హెచ్చరించిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు నందు బస్తీ ప్రెసిడెంట్ చందు కాంగ్రెస్ సీనియర్ లీడర్ అజర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన దొడ్ల వెంకటేష్ గౌడ్...



**కూకట్ పల్లి సెప్టెంబర్ 18 వెలుతురు:**
కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎం.పి గడ్డం రంజిత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ తరపు నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్ళతో కలిసి తరలివెళ్లి రంజిత్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రంజిత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శిరీష సత్తూర్...

**కూకట్ పల్లి సెప్టెంబర్ 18 వెలుతురు:**
చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ రంజిత్ రెడ్డి ని గురువారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజల బాగోగులు చూసుకుంటూ, ఎన్నో స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు రంజిత్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని ఆమె మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మధు, గాయత్రి, శ్రీనివాస్ గౌడ్, పద్మ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# 11 రోజులుగా రిలే నిరాహార దీక్షలు

- **సొంతింటి కల కోసం పోరాట మార్గం**
- **సీఎం సార్ నీవే దిక్కంటూ వేడుకోలు**




**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 18:**
ప్రజా పాలనతో పేదల ఆకాంక్షలు నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసార్... జర్నలిస్టుల సొంతింటి సమస్యపై కూడా వెంటనే స్పందించాలని కోరుతూ గత పది రోజులుగా జెఎన్‌జె హౌజింగ్ సోసైటీ సభ్యులు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. 20 ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తున్న జర్నలిస్టులు పోరాట మార్గాన్ని ఎంచుకున్నారు. అంకుఠిత దీక్షతో హసన్ షరీఫ్ గత 11 రోజులుగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. అతనికి మద్దతుగా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రతి రోజు కొందరు జర్నలిస్టులు నిజాంపేట్ కు వచ్చి సంఘీభావం తెలపడంతో పాటు ధర్నాలో తమ వంతుగా కూర్చుంటున్నారు.

**11వ రోజున హసన్ షరీఫ్ కు మద్దతుగా మంజుల, వాసు సంఘీభావం తెలిపి నిరాహార దీక్షలో కూర్చున్నారు.**

కాగా ఊపర్ షెర్వానీ, అందర్ పరేషానీ అన్నట్లుగా తమ పరిస్థితి ఉందని సీనియర్ జర్నలిస్టులు వాపోతున్నారు. తమ దీన స్థితిని ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రికి విన్నవిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మమ్మల్ని గుర్తు పెట్టుకుని రవీంద్ర భారతి వేదికగా స్థలాల మెమో ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. సుప్రీంకోర్టు తీర్పుతో దిక్కుతోచని స్థితిలో పడ్డ తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. 30, 40 ఏళ్ల జర్నలిజం కేరీర్‌లో తాము సంపాదించుకున్నదేమీ లేదని, వృద్యాప్యంలో ఉన్న తమకు సొంతిల్లే భరోసాగా భావించామన్నారు. సోసైటీ కమిటీ నిర్వాకం వల్లే ఇపుడు ఈ దీనస్థితికి చేరుకున్నామని అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని... పేద జర్నలిస్టులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## మైనార్టీ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ అధ్యాపకుల జీతాలు తగ్గించడం సరైంది కాదు

### బిఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకుడు లాలగారి జంగయ్య

**మంచాల వెలుతురు సెప్టెంబర్18:**
మంచాల మండలం కేంద్రంలో బిఅర్ఎస్,పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకుడు లాలగారి జంగయ్య మాట్లాడుతూ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ అధ్యాపకులుగా పని చేసేవారి జీతాలు పెంచేదిపోయి ఉన్న జీతాలు తగ్గించడం సరైందికాదు అన్నారు గురుకులాల్లో పని చేసే అధ్యాపకులకు పనికి దగ్గవేతనం ఇవ్వాల్సిందిపోయి ఉన్నజీతాలు తగ్గించడం ఎంతవరకు సరైదో కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకోవాలనీ అన్నారు గురుకులాల్లో పనిచేసే అధ్యాపకులకు ఎంతో ఒత్తిడి ఉంటుందని వారికి డ్యూటీలు కూడ అదనంగా ఉంటాయాని వారికీ సరైన సమయానికి జీతాలు ప్రభుత్వం వేయకున్న ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ సమయానికి వచ్చి విద్యను అందించే అధ్యాపకుల జీతాలు పెంచేదిపోయి వారి జీతాలు తగ్గించడం ప్రభుత్వం చేతకానీ తనానికి నిదర్శనం అని అ న్నారు గత బిఅర్ఎస్ ప్రభుత్వ హయంలో వారికి 25000 జీతం ఉన్న జీతం పి ఆర్ సి రావడంతో పనికి దగ్గ వేతనంగా 35000జీతం గుర్తించి ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వారి జీతాలు ప్రస్తుతం 23000 లకు కుదించడం సిగ్గుచెటని అన్నారు12000జీతం తగ్గించడంవల్ల జరిగిన పూర్తి బాధ్యత ఈప్రభుత్వం వహించాల్సి వస్తుందని అన్నారు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పింది ఏంది ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేసేదిఎందని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం తీరు చూస్తుంటే పిచ్చితుగ్లక్ పాలన గుర్తుచేస్తుందని అన్నారు ఇన్నేళ్ల చరిత్రలో ఎ ప్రభుత్వం అధ్యాపకుల జీతాలు తగ్గించిన ప్రభుత్వం లేదని ఇది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంకె ఈఘనతదక్కుతుందనీ అన్నారు చేశారు ఈ ప్రభుత్వం తీసుకున్న ఈనిర్ణయం వెంటనే వెనక్కుతీసుకోని పాతపద్ధతిలోనే వెంటనే జీతాలు ఇవ్వాలని లేనిఏడలా సెక్రెటరేట్ ముట్టడిస్తామని ప్రభుత్వన్ని హెచ్చరించారు



## ప్రతిష్టాత్మక అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

- **దేశ,విదేశాల నుంచి హాజరుకానున్న తెలుగు ప్రతిభావంతులు**
- **హైదరాబాద్ లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో అవార్డుల ప్రధానం**
- **అంతర్జాతీయ ప్రమాణాలతో చురుగ్గా ఏర్పాట్లు...**



**వెలుతురు, హైదరాబాద్ సెప్టెంబర్ 18 :**
అంతర్జాతీయ అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమైఖ్య సంస్థ 24వ వార్షికోత్సవం సందర్భంగా ఇరు తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ రంగాల ప్రతిభావంతులకు ఏటా ప్రదానం చేసే అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షులు డా.గణగళ్ళ విజయకుమార్ నేడొక ప్రకటనలో తెలిపారు. విద్య,వైద్యం, విధి నిర్వహణ, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, నృత్యం, క్రీడలు,కళలు, సాహిత్యం, చిత్రలేఖనం, శాస్త్రీయ సంగీతం (నాదస్వరం, డోలు, సాక్సోఫోన్, గాత్రం) ఆధ్యాత్మికం, ఉపాధి కల్పన తదితర రంగాల్లో ప్రతిభ గల వ్యక్తులు, చిన్నారులు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే ఎంపిక ప్రక్రియలో భాగంగా రాష్ట్రస్థాయి ఆంధ్రరత్న, తెలంగాణ రత్న, అవార్డులతో పాటు పదిమంది అత్యుత్తమ ఉపాధ్యాయులకు జాతీయస్థాయి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ఇతర రంగాల్లో సేవలు అందించిన పదిమందికి నేషనల్ బెస్ట్ సిటిజెన్ మరియు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డులను అందచేయనున్నారు. అంతేకాకుండా అభ్యర్థుల కేటగిరీల వారీగా ఎన్టీఆర్ స్మారక కళా విభూషణ్, డాక్టర్ సినారే సాహిత్య కళానిధి, ప్రముఖ వృత్య కళాకారులకు సిద్ధేంద్ర యోగి నాట్య కళా విశారద, వంటి జాతీయ అవార్డులతో పాటు ఏదైనా మూడు రంగాల్లో విశేష ప్రతిభ గల ఇద్దరికి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన " భారత ప్రతిభారత్న " ప్రతిష్టాత్మమైన పురస్కారాన్ని అందచేయనున్నామని వివరించారు. ఆసక్తి, ప్రతిభ ఉన్నవారు తమ దరఖాస్తులను సెల్ నెంబర్ 9391379903 నెంబర్ కు అక్టోబర్ ఆరవ తేదీలోగా పంపుకోవాలని కోరారు. ఎంపికైన వారికి సంస్థ 24వ వార్షికోత్సవం అక్టోబర్ 20 సోమవారం నాడు హైదరాబాదులోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో అవార్డులను ప్రధానం చేయనున్నామని డా.గణగళ్ళ విజయ్ కుమార్ తెలిపారు.

## మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యాష్కీ గౌడ్ ను కలసి తన ఆరోగ్య యోగాక్షేమలను అడిగి తెలుసుకున్న బీసీ నాయకులు

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**
కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ ,మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యాష్కీ గౌడ్ ను గురువారం రోజున తన నివాసంలో కలసి తన ఆరోగ్య యోగాక్షేమలను అడిగి తెలుసుకున్న బీసీ నాయకులు మొన్న సెక్రటేరియట్ లో అస్వస్థతకు గురికావడం హాస్పిటల్ నుంచి ఇంటికి రావడం తో అందరికీ సంతోష కరమైన అంశం,ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి ని,అడిగి తెలుసుకుని పరామర్శించిన, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్ దుర్గయ్య గౌడ్ , గౌడ సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, గౌడ సమన్వయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్లికట్టే విజయ్ కుమార్ గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నాగేష్ గౌడ్ తదితరులున్నారు..



# రాగల మూడురోజులు భారీ వర్షాలు

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

**హైదరాబాద్,సెప్టెంబర్18( వెలుతురు):**
తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీచేసింది. సూర్యాపేట, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని.. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. శుక్ర, శనివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలుపడుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటున సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించిందని ఉందని తెలిపింది. మధ్యప్రదేశ్ మధ్య ప్రాంతాల నుంచి పశ్చిమ–మధ్య ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతం వరకు తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా సగటు–సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతుందని వాతావరణశాఖ వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట, హైదరాబాద్, పలు పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ముషిరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్‌లో 15.5 సెంటీ–మీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

# డిపి స్కూల్లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి


- **నిర్లక్ష్యంగా వ్యవహరించిన నాచారం సిఐపై బదిలీవేటు**

**హైదరాబాద్,సెప్టెంబర్18( వెలుతురు):**
దిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిపై దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై నాచారం సీఐపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. పుట్టిన రోజున.. బర్త్‌డే బంప్స్ పేరిట తోటి విద్యార్థులు చేసిన వికృత చేష్టలతో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపేటకు చెందిన విద్యార్థి(14) నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆగస్టు 29న పుట్టినరోజు కావడంతో.. తోటి విద్యార్థులు మధ్యాహ్నం విరామ సమయంలో సరదాగా చేసిన చేష్టలతో ఆ విద్యార్థి మర్మంగానికి గాయమై రక్తస్రావమైంది. పిడిగుద్దుల ధాటికి రక్తం కారుతున్నా.. తోటి విద్యార్థులు వదల్లేదు. విషయం తెలిసి ప్రిన్సిపల్ ఆ విద్యార్థిని ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం బంజారాహిల్స్‌లోని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి శస్త్ర చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై కుటు–ంబ సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికీ బాధ్యులైన విద్యార్థులు, పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నాచారం సీఐని బదిలీ చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

# వామనరావు దంపతుల హత్య కేసు

- **మంథని కోర్టులో సమాచారం తీసుకున్న సిబిఐ**

**పెద్దపల్లి,సెప్టెంబర్18( వెలుతురు):**
రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన అడ్వకేట్ వామన్ రావు దంపతుల హత్య కేసులో సిబిఐ విచారణ ప్రారంభమైంది. వామన్ రావు దంపతుల హత్య కేసుకు సంబంధించిన విచారణ నిమిత్తం గురువారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు మంథని కోర్టులో ప్రభుత్వ సమాచారాన్ని తీసుకున్నారు. అంతేకాకుండా వామన్ రావు స్వగ్రామమైన గుంజపడుగు వెళ్లి వివరాలను సేకరించారు. హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్‌రావు దంపతుల హత్య కేసులో ఏడుగురు నిందితులు బెయిల్‌పై ఉన్నారు. వామన్‌రావు దంపతుల హత్య కేసులో మాజీ ఎమ్మెల్యే హస్తం ఉందని తండ్రి కిషన్‌రావు ఆరోపణల నేపథ్యంలో సిబిఐ అధికారులు విచారణ ప్రారంభించారు. అనంతరం మంథని కోర్టు ప్రాంగణంలో వామన్ రావు తండ్రి కిషన్ రావు, తమ్ముడు చంద్రశేఖర్ నుంచి వివరాలను సిబిఐ అధికారులు సేకరించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించనున్నారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత

- రామన్నపేట ఎస్సై డి. నాగరాజు



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 18:**
బాచుప్పల గ్రామా శివారులో ఉన్న మూసి వాగు నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నరని, నమ్మదగిన సమాచారం రాగా అట్టి సమాచారం మేరకు రామన్నపేట పోలీసువారు గస్తీ నిర్వహించగా, ఎన్నారం గ్రామా శివారులో ఉన్న ఎక్స్ రోడ్డు దగ్గర నుండి రెండు ఇసుక లోడు తో ఉన్న ట్రాక్టర్ రావడం తో అట్టి ట్రాక్టర్ లను పట్టుబడి చేసి అనుమతుల గురించి అడుగగా వారి దగ్గర ఎటువంటి అనుమతులు లేవని చెప్పగా వారి వివరాలు తెలుసుకొనగా, వారు బాచుప్పల గ్రామానికి చెందినా బొబ్బల నాగేష్ తండ్రి మల్లయ్య మరియు బొక్క మల్లారెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి అని తెలిసినది తరువాత పొలిసు స్టేషన్ కు అట్టి ట్రాక్టర్ లను తీసుకోని వచ్చి చట్ట ప్రకారం చర్యల గురించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడమైనది. ఏవరైన ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మూసి వాగు నుండి ఇసుకను తరలిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గ సాధన కోసం కలెక్టర్ కి మెమోరండం.



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 18**
నియోజకవర్గ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నియోజకవర్గ సాధన సమితి కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కి 500 మంది సంతకాల సేకరణతో, కూడినటువంటి మెమోరండం కలెక్టర్ కి ఇవ్వడం జరిగింది. కలెక్టర్ స్పందించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి, డిలిమిటేషన్ కమిటీకి సిఫారస్ చేస్తానని వారు అన్నారు. మెమోరండం ఇచ్చినవాళ్లలో నియోజకవర్గ సాధన సమితి గౌరవ అధ్యక్షులు పోతరాజు శంకరయ్య, అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వరికల్లు గోపాల్, బొడ్డు శంకరయ్య ,నల్ల నరేందర్ గంగాపురం యాదయ్య ,కూనూరు కృష్ణ, యం.డి ఫజల్, గడ్డం యాదగిరి, నరేందర్, నర్సింహ్మా చారి, యం.డి ఇమామ్, గంగపురం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారుల పాలనలో పడకేసిన పారిశుద్ధ్యం



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 18**
గ్రామాలలో ప్రజాప్రతినిధులు లేక పారిశుద్ధ్య పనులు పడకేశాయని ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలారని పలువురు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలో గత రెండు నెలల క్రితం నుండి గ్రామానికి ఇంటింటికి సరఫరా అయ్యే మంచినీటి గేట్ వాల్స్ రిపేర్ కావడంతో వర్షానికి వచ్చిన మురికి నీరు మరియు గేట్ వాల్ నుండి బయటికి వచ్చే నీరు రెండు కలిసి మళ్లీ అదే గేట్ వాల్ నుండి పైప్ లైన్ లోకి వెళ్లి అదే నీరు గ్రామ ప్రజలందరికీ వెళ్తున్నాయని, దీని వలన ఈ మధ్యకాలంలో చాలా మందికి దురద,చర్మ వ్యాధులు వస్తున్నాయని గ్రామపంచాయతీ కార్యదర్శికి చెప్పినా గానీ మా దగ్గర ఎలాంటి డబ్బులు లేవనే సాకుతో ,చిన్న చిన్న పనులు కూడా పక్కకు పెడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగేలా, చేస్తున్నారని గ్రామానికి సరఫరా అయ్యే వీధిలైట్లు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఎం.సి.బిలు ఫీజులు పోయినా గానివాటి స్థానంలో కొత్త ఫీజులు వేయడం లేదు. దాని వలన వీధిలైట్లు నిరంతరం ఆఫ్ కాకుండా వెలుగుతున్నాయని, పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీలో చిల్లి గవ్వలేదని సాకులు చెబుతూ వస్తున్నారని, గత మూడు సంవత్సరాల నుండి మంచి నీటి ట్యాంకులకు మెట్లు లేవని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, వాటి సమస్యకు ఎలాంటి పరిష్కారం దొరకడం లేదని, ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు పరిష్కారం కాకుండా మరింతగా పేరు పోతున్నాయని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బాల్య మిత్రుడు మరణం.

- 1996 -97 ఎస్ఎస్ సి బ్యాచ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 18**
ఇంద్రపాల నగరం గ్రామానికి చెందిన రాజన్న గారి మహేష్ ఇటీవల గుండెపోటుతో మరణించడం తో వారి చిన్న నాటి స్నేహితులు పదవ తరగతి విద్యార్థులు (1996-97 ) అందరూ కలిసి 75,500 రూపాయల ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులకు అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారి స్నేహితులు రవ్వ అశోక్ కుమార్, మల్లెబోయిన గణేష్, దొంత జగన్, రాధారపు మల్లేశం, రాజన్న గారి రేణుక పాల్గొన్నారు.

# తనపై మీడియాలో, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తల పుకార్లను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు వెలుతురు సెప్టెంబర్ 18:**
కొన్ని చానల్లో సోషల్ మీడియాలో నా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బ తినే విధంగా తప్పుడు వార్తలు వస్తున్నాయి ఈ మధ్యకాలంలో ఆంధ్రజ్యోతి పేపర్ ని తలపించేలా అందజ్యోతి అనే పేరుతో ప్రింట్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి లేదన్న రాజగోపాల్ రెడ్డి అనే శీర్షికన నేను అనని మాటలు అన్నట్లు ప్రచురిస్తున్నారు.. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి గురించి మొట్టమొదటి అసెంబ్లీలో ప్రస్తావించిందే నేను నాకు మంత్రి పదవి రానందుకు రేవంత్ రెడ్డి పైన, ప్రభుత్వం పైన నేను అనని మాటలను అన్నట్టు తప్పుడు కథనాలను సృష్టించి అబద్దాలను ప్రచారం చేస్తున్నారు. నా పైన వచ్చే తప్పుడు వార్తలను అబద్దాలను తీవ్రంగా ఖండిస్తున్నా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఒకసారి ఎంపీగా ఒకసారి ఎమ్మెల్సీగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాకు కాంగ్రెస్ పార్టీ అన్న సోనియా గాంధీ అన్న రాహుల్ గాంధీ గారు అన్నా ఎంతో అభిమానం

### మా కుటుంబమే కాంగ్రెస్ పార్టీ నేపథ్యం

నేను రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ




పెడుతున్నానని తప్పుడు వార్తలు రాస్తున్నారు కొందరు గిట్టని వ్యక్తులు నా ప్రతిష్ట దెబ్బతీయడానికి సోషల్ మీడియా ద్వారా అవస్తవాలు పుకార్లు ప్రచారం చేస్తున్నారు దయచేసి తెలంగాణ సమాజం పుకార్లను నమ్మకండి కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కొన్ని సందర్భాలలో అంతర్గతంగా బహిర్గతంగా ఈ విధంగా చేస్తే బాగుంటుంది అని కొన్ని వేదికల్లో చెప్పడం జరిగింది త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ విషయంలో కొంతమంది అనుకూలంగా మార్చుకున్నారని అనుమానాలు ఉన్నాయి. భూ నిర్వాసితుల విషయంలో కూడా తగిన పరిహారం ఇచ్చి న్యాయం చేస్తే బాగుంటుంది అని నా అభిప్రాయం చెప్పాను గురువారం రోజున కూడా నేను గుంటూరు ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరవ్వడానికి వెళ్తుంటే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి గారిని కలవడానికి వెళ్తున్నాడని పుకార్లు సృష్టిస్తున్నారు నేను గుంటూరు వెళుతున్నాను అంటే మా నియోజకవర్గంలో నుంచి కూడా కొంతమంది నాయకులు నాతో వస్తా అన్నారు నేను మా నాయకులు కలిసి గుంటూరులో ప్రవేట్ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత అటు నుండి విజయవాడ వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకొని వద్దామని వెళ్తున్నాం దానికి నేను జగన్ ని కలవడానికి వెళ్తున్నానని దుష్ప్రచారం చేస్తున్నారు నా రాజకీయం గురించి నా భవిష్యత్తు గురించి నేను మీడియా సమావేశం పెట్టి చెబుతాను తప్ప అప్పటివరకు ఈ దుష్ప్రచారాలను నమ్మకండని తెలంగాణ సమాజాన్ని కోరుతున్న.

## సకాలంలో రైతులకు యూరియా అందించాలి

**- చండూరు ఆర్డీవో వందనపు శ్రీదేవి.**

**మునుగోడు, సెప్టెంబర్ 18 (వెలుతురు):**
రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో యూరియా అందించాలని చండూరు ఆర్డీవో వందనపు శ్రీదేవి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సిబ్బందికి సూచించారు. గురువారం ఆమె యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యాలయ సిబ్బందిని యూరియా నిల్వ, పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందొద్దని తగినంత యూరియా సరఫరా ఉందన్నారు. వారి వెంట ఇంచార్జ్ తహసిల్దార్ నేలపట్ల



నరేష్,మండల వ్యవసాయ అధికారిని సరస్వతి పద్మజ,ఆర్ ఐ వంశీ,వ్యవసాయ విస్తరణ అధికారులు వహీద్,నిఖిల్,పి ఎస్ సి ఎస్ సిబ్బంది ఉన్నారు.



## ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సుంకరి బిక్షం గౌడ్

**మునుగోడు,సెప్టెంబర్ 18 (వెలుతురు):**
పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సెక్రటేరియట్ లో మర్యాదపూర్వ కంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు వర్కింగ్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి 2003 డీఎస్సి ఉపాధ్యాయులకు వెంటనే సిపిఎస్ రద్దుచేసే ఉత్తర్వులు ఇవ్వాలని వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం పిఆర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మండల అధ్యక్ష, కార్యదర్శులు యూసుఫ్ పాషా,మేకల అన్నపురెడ్డి, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## సింగరేణి ప్రమాదంలో ఇద్దరు కార్మికులు అస్వస్థత

**జయశంకర్ భూపాలపల్లి ,సెప్టెంబర్18(వెలుతురు):**
సింగరేణి భూగర్భ గనిలో ప్రమాదం చోటుచేసుకుంది. కేటీకే 5 ఇంక్లైన్ రెండో లెవెల్ వద్ద వెల్డింగ్ చేస్తున్న క్రమంలో నిప్పు అంటుకుని విషవాయువులు వెలువడ్డాయి. ఈ ప్రమాదంలో అన్వేశ్, ప్రదీప్ అనే ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు బాధితులను చికిత్స నిమిత్తం సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మొదటి షిఫ్ట్ ముగిసే సమయానికి ఈ దుర్ఘటన జరిగినట్లు- తెలుస్తోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ, ఫైర్, సేఫ్టీ సిబ్బంది ముమ్మర సహాయక చర్యలు చేపట్టారు. గని లోపల పంప్ ఆపరేటర్ చిక్కుకున్నట్లు- అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రతిపక్షాలు దుష్ప్రచారం మానుకోవాలి

### ఆత్మకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్



**ఆత్మకూర్ వెలుతురు సెప్టెంబర్ 18:**
ఆత్మకూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆత్మకూర్ పి ఏ సి ఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం మానుకోవాలని గత పది సంవత్సరాల నుండి బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని అప్పుల పాలు చేశారని వారిని ప్రజలు తరిమి కొట్టిన ఇంకా బుద్ధి రాలేదన్నారు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యే పై అసత్య ప్రకటనలు మానుకోవాలని రాష్ట్రంలో యూరియా కొరతను సృష్టించింది కేంద్ర ప్రభుత్వం బిజెపి అయితే ,కాంగ్రెస్ ప్రభుత్వం పై నిందలు వేయడం సరికాదన్నారు ,బిజెపి బిఆర్ఎస్ కలిసి డ్రామాలాడుతున్నారని ,ప్రజా ప్రభుత్వంలో వారికి ప్రజలు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని తెలిపారు యూరియా కొరత విషయంలో బిజెపి ఎంపీ బహిరంగంగా చెబుతుంటే కావాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బధనం చేయడం సరికాదన్నారు బిజెపి బిఆర్ఎస్ నాయకుల డ్రమాలను తెలంగాణ ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని , మా ప్రజా ప్రభుత్వం పై తప్పుడు ప్రచారాలు చేస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎక్కడికక్కడ నిలదీస్తామని తెలిపారు పరకాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు నాయకులు పరకాల రేవూరి ప్రకాష్ రెడ్డి పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఇది వారి విజ్ఞతకే వదిలిస్తున్నామని రాబోయే స్థానిక ఎలక్షన్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని అన్ని గ్రామ పంచాయతీలో సర్పంచి, ఎంపీటీసీ ,జెడ్పిటిసి ఎంపీపీలు ,జిల్లా పరిషత్ చైర్మన్ ల,ను కైవాసం చేసుకుంటామని కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని ఆయన తెలిపారు.

## లింగోజిగూడెం 28, 29 వ బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్..





**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 18:**
భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ 3వ, వార్డు (లింగోజిగూడెం) 28, 29 వ బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75 వ జన్మదిన సందర్భంగా సేవా పక్వాడ్ 2025 ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు పలు సేవా కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగోజిగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లింగోజిగూడెం మాజీ సర్పంచ్ రమణగొని శంకరయ్య పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ బూత్ అధ్యక్షులు ఇటికాల దామోదర్ రెడ్డి కడారి ఐలయ్య పర్నే అంజిరెడ్డి ఉదరి రంగయ్య పర్నే శేఖర్ రెడ్డి ఎర్రగోని మల్లేశం బోసి కృష్ణ పిల్ల శ్రీధర్ బాతరాజు గణేష్ శివశంకర్ బొడ్డు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## శిథిలావస్థలో మండల పరిషత్ కార్యాలయం.

**- ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి**



**తిరుమలగిరి (సాగర్ ) వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 18:**



మండల కేంద్రంలో గల ఎంపిడీవో కార్యాలయం శిథిలావస్థలో ఉన్నందున నూతన కార్యాలయ భవన నిర్మాణానికి తక్షణమే ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి తిరుమలగిరి సాగర్ ఎంపిడివోను ఆదేశించారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు, కాగా ఎంపీడీవో కార్యాలయం అన్ని గదులు శిథిలావస్థకు చేరుకొని విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో ఎంపిడివో తో పాటు సిబ్బంది విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అన్ని గదులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నూతన భవన నిర్మాణానికి గాను వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్ తదితరులు ఉన్నారు

## సమాజంలో విశ్వకర్మల పాత్ర వెలకట్ట లేనిది

- ఎమ్మెల్యే పాయల్ శంకర్





**ఆదిలాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**

ప్రస్తుత సమాజంలో విశ్వకర్మ పాత్ర వెలకట్టలేనిది ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలను గురువారం విశ్వకర్మ మరాఠీ సంఘం ఆధ్వర్యంలో గోపాలకృష్ణ మఠంలో ఘనంగా నిర్వహించారు. అలాగే బ్రహ్మంగారి గుడి దగ్గర నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమానికైనా ఆయన ముఖ్యఅతిథి హాజరై విశ్వకర్మ విగ్రహానికి పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . ప్రపంచ నిర్మాణంలో విశ్వకర్మ పాత్ర ఏనలేదని పేర్కొన్నారు. కులస్తులంద ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోవచ్చని పేర్కొన్నారు.. జిల్లా కేంద్రంలో ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.. గోపాలకృష్ణ పీఠాధిపతి యోగానంద సరస్వతి మాట్లాడుతూ.. ప్రతిరోజు విశ్వకర్మను పూజిస్తే మోక్షం లభిస్తుంది అన్నారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాన్వె సంతోష్, ఏం దిలీప్, వివిధ మండలల కులస్తులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు...

## గొర్ల కాపరుల సంఘం సమస్యల పరిష్కారం నా వంతు ప్రయత్నం ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**

గొర్ల కాపరుల సంఘం సమస్యల పరిష్కరిస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు గొర్ల కాపరుల సంఘం ఎన్నిక కాగా జిల్లా అధ్యక్షులుగా సాయి చైతన్య ఉపాధ్యక్షులు గా కేమ రాకేష్ గురువారం రోజున ఎమ్మెల్యే పాయల్ శంకర్ ని కలిశారు ఈ సందర్భంగా వారికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు వారితో పాటు గొర్ల కాపరుల సంఘం నాయకులు తదితరులున్నారు



## అట్టహాసంగా నారాయణి షాపింగ్ మాల్ ప్రారంభం








వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 18 : సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణ ప్రముఖ వస్త్ర వ్యాపార దిగ్గజం నారాయణి మెగా షాపింగ్ మాల్ రెండవ బ్రాంచ్ పట్టణంలోని బసవేశ్వర చౌక్ లో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ప్రముఖ సినీ నటి నాగదుర్గతో కలిసి గురువారం గణపతి పూజ చేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ఎంపీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపారంలో దినదినాభివృద్ధి చెందుతూ కస్టమర్లకు క్వాలిటీ బట్టలను డిస్కౌంట్ రేట్లలో, మంచి ఆఫర్లు అందుబాటులో ఉంచారని నారాయణ షాపింగ్ మాల్ యాజమాన్యాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ నిర్వాహకులు అనంతం అండ్ బ్రదర్స్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల పెళ్లిళ్లకు,వివిధ ఫంక్షన్లకు పండగలకు అన్ని రకాల వస్త్రాలను సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని, కేవలం 999 రూపాయల కొనుగోలుతో ఒక కూపన్ ఏర్పాటు చేసి డిసెంబర్ 31 లక్కీ డ్రాలో బంపర్ డ్రా కింద మూడు రోనాల్డ్ క్విడ్ కార్లను కస్టమర్లకు అందుబాటులో ఉంచామని ప్రజలు ఈ చక్కటి అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. ప్రారంభోత్సవంలో వివిధ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు,నియోజకవర్గ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


## మోడీ ప్రభుత్వ సారధ్యమే దేశానికి శ్రీరామరక్ష....

**- భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దే సంకల్పం, లక్ష్యంతో మోడీ సర్కార్ పనిచేస్తుంది...**

**- బిజెపి నేతలు బొంతల కళ్యాణ్ చంద్ర, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, ఎర్రోజు లక్ష్మణ్...**







**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 18:**

భారతదేశానికి మోడీ ప్రభుత్వ సారధ్యమే శ్రీరామ రక్ష లాంటిదని బిజెపి జిల్లాఅధికార ప్రతినిధి , సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర , బిజెపి తిమ్మాపూర్ మండలసేవ పక్వాడ అభియాన్ తిమ్మాపూర్ మండల కన్వీనర్ , కో కన్వీనర్ కొయ్యడ శ్రీనివాస్ గౌడ్ , ఎర్రోజు లక్ష్మణ్ అన్నారు. సేవా పక్వాడ ప్రోగ్రాంలో భాగంగా గురువారం రోజున అలుగునూరు పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ, శ్రీ రామ సాయి దేవాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ మండల బిజెపి నేతలు దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొంతల కళ్యాణ్ చంద్ర, కొయ్యడ శ్రీనివాస్ , ఎర్రోజు లక్ష్మణ్ లు మాట్లాడుతూ సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఇక్కడి దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రపరచడం జరిగిందని తెలిపారు. మోడీ ప్రభుత్వం 2014 లోఅధికారంలోకి వచ్చిన తర్వాత స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. ఇట్టి స్వచ్ఛభారత్ ముఖ్య ఉద్దేశం మన చుట్టూ ఉన్న పరిసరాలు చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దేశంలో 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. దేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలనే సంకల్పం లక్ష్యంతో పరిపాలన కొనసాగిస్తుందని తెలిపారు. మోడీ ప్రభుత్వ సాహసోపిత, చారిత్రక నిర్ణయాలతో భారతదేశ దిశా దశ మారిందని , నేడు దేశం అన్ని రంగాలలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందన్నారు. భారతదేశ నేడు బలమైన ఆర్థిక శక్తిగా అవతరించిందని, ఇది మోదీ నాయకత్వంలోనే సాధ్యమైందన్నారు. దేశ ప్రజలంతా మోడీ ప్రభుత్వంపై ఎంతో విశ్వాసంతో ఉన్నారని, అందుకే వరుసగా మూడు సార్లు మోడీ కి ప్రధానిగా అవకాశం కల్పించారని తెలిపారు. బిజెపి జనం గుండెల్లో ఉందని, ఆ స్థానాన్ని ఎవరు తుడిచి పెట్టలేరన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్ ,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బోనాల మోహన్ ,కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ నాయకత్వానికి ప్రపంచ దేశాలు జేజేలు పలుకుతున్నాయి...

**- మోది తో ఏదైనా సాధ్యమే.. విశ్వ గురువుగా దేశాన్ని తీర్చిదిద్దడమే బిజెపి సంకల్పం...**

**- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...**







**హుజురాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**

ప్రధాని మోదీ ఆలోచనలు నిర్ణయాలు, పాలన విధానాలతో భారతదేశం నేడు తిరుగులేని శక్తిగా అవతరించిందని , మోదీ నాయకత్వానికి ప్రపంచ దేశాలు జేజేలు పలుకుతున్నాయని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. సేవా పక్వాడ ప్రోగ్రాంలో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గం లోని ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో స్థానిక బిజెపి శ్రేణులు నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో గంగాడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు చేపట్టిన సేవ పక్వాడ కార్యక్రమాలన్నింటినీ బిజెపి శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. భారతదేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వరుసగా మూడు టర్మ్ లు అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం నిరంతరం ప్రజల, దేశ అభివృద్ధి కోసమే పరితపించి పనిచేసిందన్నారు. అందులో భాగంగానే పేద మధ్యతరగతి ప్రజలకు నిత్యావసవస్తువులపైపై పన్నుల భారాన్ని తగ్గించాలని ఉద్దేశంతో గూడ్స్ సర్వీస్ టాక్స్ (జీఎస్టీ) తగ్గింపు ప్రక్రియను చేపట్టిందన్నారు. ఈనెల 22 నుండి జీఎస్టీ పన్నుల భారం తగ్గనుందని , దీంతో ప్రజలకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉందన్నారు. మోడీ ప్రభుత్వం జీఎస్టీ పై సంచల నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే అంతర్జాతీయ , దేశీయ వ్యతిరేక శక్తులు మోడీ ప్రభుత్వాన్ని అనేక కుట్రలు కుతంత్రాలతో ఇబ్బంది పెట్టాలని చూసిన నిలదొక్కుకొని పరిపాలన కొనసాగిస్తుందన్నారు. పోరుగునున్న దేశాల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని, ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధ వాతావరణం లో ఉన్నాయని , భారతదేశం మాత్రం మోడీ పాలనలో సురక్షితంగా ఉందన్నారు. దేశ ప్రజలంతా మోడీ ప్రభుత్వంపై ఎంతో విశ్వాసంతో ఉన్నారని , ప్రధాని మోదీ నాయకత్వమే దేశానికి రక్ష అనే భావనతో ప్రజలంతా అండగా నిలుస్తున్నారని తెలిపారు. బిజెపి ప్రజల గుండెల్లో ఉందని, భవిష్యత్తు అంతా బిజెపి దేనన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పై అనతి కాలంలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, రేవంత్ రెడ్డి సర్కార్ అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై గుర్రు గా ఉన్నారని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భయపడుతుందన్నారు. ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని, తెలంగాణలో కూడా బిజెపి ప్రభుత్వమే రావాలని బలంగా కోరుకుంటున్నారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

## ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీ

**- ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం**

**మహబూబ్‌నగర్,సెప్టెంబర్18( వెలుతురు):**

ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలోని కొత్తమొల్గర సమీపంలో గురువారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండలానికి చెందిన ముగ్గురు ప్రయాణికులు ఆటోలో భూత్పూర్ వైపు వెళు_న్నారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ కొత్త మొల్గర సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన సంపల్లి వంశీ (24), హైదరాబాద్‌కు చెందిన నర్సింహారెడ్డి (57) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. దొంతికుంట తాండకు చెందిన పాత్లవత్ సక్రి (34) తీవ్రగాయాలపాలవ్వడంతో జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రోటోకాల్ విస్మరించిన సిరిసిల్ల కలెక్టర్

**- ఆదిశ్రీనివాస్ ఫిర్యాదుతో వివరణ కోరని ప్రభుత్వం**

**హైదరాబాద్,సెప్టెంబర్18( వెలుతురు):**



రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ అయింది. బుధవారం ప్రజా పరిపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రోటోకాల్ పాటించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జెండా ఆవిష్కరణ సమయానికి హాజరు కాకపోవడంతోపాటు– కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలకడంలో కలెక్టర్ నిర్లక్ష్యం వహించారు. ఈ విషయంపై బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎంవోకు ఆది శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటనకు సంబంధించి రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని కలెక్టర్ కు నోటీసులు జారీ చేసింది ప్రభుత్వం. అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిబంధనలు పాటించకుండా వ్యవహారించిన తీరును సర్కార్ తప్పుబట్టింది. రోజురోజుకూ వివాదాస్పదంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మారుతున్నారని సర్కార్ సీరియస్ అయింది.ఓ భూ నిర్వాసితుడి విషయంలోనూ నిన్న కోర్టు ఆయనకు వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలో ఈరోజు(గురువారం) జిల్లావ్యాప్తంగా ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా నిరసన తెలిపారు బీసీ సంఘాల నేతలు. ఈ మేరకు కలెక్టర్ సంజయ్ ఝాకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోటీ–సులు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల్లోపు వివరణ ఇవ్వాలని సీఎస్ ఆదేశించారు. కలెక్టర్ ఇచ్చే వివరణను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం

# ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు

**- కలెక్టర్‌తో మాట్లాడిన కెటిఆర్**

**- రైతులకు అన్యాయం చేస్తే మరో లగచర్ల అంటూ హెచ్చరిక**



**వికారాబాద్,సెప్టెంబర్18( వెలుతురు):**

రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్రంగా స్పందించారు. రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు మారుస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. అలైన్‌మెంట్‌ను మార్చి రోడ్డు నిర్మాణం చేపడితే మరో లగచర్ల ఘటన రిపీట్ అవుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కేటీఆర్ హెచ్చరించారు . గతంలో ఆమోదించిన రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం అలైన్‌మెంట్‌ని మార్చి సర్వే నెంబర్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది.అయితే, గతంలో నిర్మించ తలపెట్టిన మార్గంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉండటంతో అలైన్‌మెంట్‌ను మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. అలైన్‌మెంట్ మార్పుతో రైతులు భారీగా భూములు కోల్పోతున్నారు. ఈ విషయంపై వారం రోజులుగా వివిధ పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేశారు అన్నదాతలు. అధికారులు తమను పట్టించుకోవడం లేదని కేటీఆర్‌ను కలిశారు. మోమిన్‌పేట మండల గ్రామాల రైతులు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఫోన్‌లో మాట్లాడారు కేటీఆర్. పేద రైతుల భూములను గుంజుకొని వారికి అన్యాయం చేస్తే మరో లగచర్ల ఘటన చోటు చేసుకుంటుందని కలెక్టర్‌ను హెచ్చరించారు. అయితే, కలెక్టర్‌ను హెచ్చరించిన వీడియో వికారాబాద్ జిల్లా వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది.

# పిల్లలకు విలువలను వారసత్వంగా ఇవ్వండి

**- మహనీయుల చరిత్రలను తెలియచేయండి**

**- సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణలో ఈటెల**



**హైదరాబాద్,సెప్టెంబర్18( వెలుతురు):**

పిల్లలకు వారసత్వంగా ఆస్తులు కాకుండా విలువలు, సంప్రదాయాలు, దేశభక్తిని నేర్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. కన్నవారిని, కన్నపిల్లలను, జీవిత భాగస్వామిని చంపుకుంటున్న ఘటనలు కలచివేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన విలువలే మనల్ని ఇలాంటి దురాగతాల నుంచి కాపాడతాయని హెచ్చరించారు. ఉప్పల్ నియోజకవర్గం కాప్రాలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆత్మగౌరవం, దేశభక్తి విలువలు గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తమ ఆత్మగౌరవం కోసం ఎమ్మెల్యే పదవిని గడ్డిపోచలా వదిలివేశామని ఈటల రాజేందర్ అన్నారు. ఆత్మగౌరవం కోల్పోయి వచ్చే ఏ పదవి అయినా విలువలేనిదని ఆయన స్పష్టం చేశారు. స్వయంపాలన కోసమే తాము 20 ఏళ్లలో ఆరుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచామని గుర్తు చేసుకున్నారు. . ఈ ఘటనలు ఎక్కడో జరుగుతున్నాయని అనుకోవద్దని, అవి మన ఇంటి గడపను కూడా తట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. మహనీయుల విగ్రహాలను స్థాపించడం, జయంతులు, వర్ధంతులు చేసుకోవడం కేవలం దండ వేయడానికి మాత్రమే కాదని, వారి చరిత్రను భావితరాలకు అందించడం కోసమని ఈటల అన్నారు. తెలంగాణ ప్రజల రక్త తర్పణాన్ని గుర్తుచేస్తూ, భారత స్వాతంత్ర్యం కోసం లక్షల మంది చేసిన పోరాటాలను, త్యాగాలను ఆయన కొనియాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ గురించి మాట్లాడుతూ, ఆయన గొప్ప మేధావి అని, తన ప్రాణం భారత జాతి విముక్తి కోసమేనని పోరాడారని ప్రశంసించారు. భారతదేశంలో సాధ్యం కాకపోవడంతో వేరే దేశానికి వెళ్లి 'ఆజాద్ హింద్ ఫౌజ్' స్థాపించి దేశం కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. నేటి తరానికి స్వాతంత్ర్య వేడుకల ప్రాముఖ్యత తెలియడం లేదని, వారు పుస్తకాలు చదవక, చరిత్రను తెలుసుకోలేకపోతున్నారని ఈటల రాజేందర్ విచారం వ్యక్తం చేశారు.

## సమాజానికి స్ఫూర్తినిచ్చేలా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం నుండి మహాత్మ గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీ వరకు

# బీజేపీ పార్టీ శ్రేణులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్







**ఆదిలాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**

సమాజానికి స్ఫూర్తినిచ్చేలా ప్రధాని నరేంద్ర మోడీ గారి జన్మదినం నుండి మొదలుకొని మహాత్మ గాంధీ గారి జయంతి అక్టోబర్ 2వ తేదీ వరకు బీజేపీ పార్టీ శ్రేణులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు, నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సేవ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ లోని ఖానాపూర్ చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఘాట్ లో గురువారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ శ్రేణులతో కలిసి బతుకమ్మ ఘాట్ వద్ద చెత్త చెదరని తొలగించారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రపంచమంతా సమర్థిస్తుందని అన్నారు. దేశ ప్రజలందరూ కోరుకున్న విధంగా ప్రపంచానికే భారతదేశ నాయకత్వం వహించాలనే విధంగా ప్రధాని మోదీ నేతృత్వంలో ఆ దిశగా దేశం పయనిస్తుందన్నారు. ఏక్కడ ఉన్న భారతదేశ ఆర్థిక వ్యవస్థ నరేంద్ర మోడీ నేతృత్వంలో మూడవ స్థానం దగ్గరలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానంద్, నాయకులు గందే విజయ్. గందే కృష్ణ . జోగు రవి, రాజేష్, దినేష్ మాటోలియా, బోయర్ విజయ్. రాజేష్. ప్రవీణ్. వేద వ్యాస్ ముకున్ రావు అశోక్ రెడ్డి. నగేష్.తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అయిపోయింది త్వరలో కాంగ్రెస్ ముగుస్తుంది

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు సెప్టెంబర్ 18:**

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, మరికొన్ని రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పని సైతం ఐపోతోందని, అలాంటి పార్టీల నాయకుల గురించి మాట్లాడడం సమయం వృధా అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సాత్నాల





మండలంలోని జామిని, జంగు గూడ గ్రామాల్లో గురువారం ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బిబీజేపీ లో చేరారు, వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రైతు చేనులో బోరుబావి తో పాటు కరెంటు, 90% సబ్సిడీతో ఫెన్సింగ్ నిర్మాణం చేయాలనేదే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు కరుణాకర్ రెడ్డి సుభాష్ రమేష్ రోహిదాస్ రాము మీరాబాయి రేణుకా బాయి ఆనంద్ రావు అశోక్ రెడ్డి ముకుందరావు తదితరులుగ్రామస్తులు పాల్గొన్నారు.

# అనేక గ్రామాల్లో తొలగని బురద

**- సీజనల్ వ్యాధుల నివారణకు ఇదే మార్గం**

**- సవాల్‌గా మారిన పారిశుద్య నిర్వహణ**

**ఏలూరు,సెప్టెంబర్18( వెలుతురు):**

ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇటీవలి వర్షాలు వరదల కారణంగా పలుప్రాంతాలు కంపు కొడుతున్నాయి. అనేక లంకగ్రామాలు, విలీన మండలాల గ్రామాలు ఇంకా బురదలోనే ఉన్నాయి.ప్రజలు దీంతో సహవాసం చేస్తూ అవస్థలు పడుతున్నారు. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ఏలూరులో వింతవ్యాధి ఇటీవల ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలు తున్న విషయం సుస్పష్టం. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్ధ్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ చేపట్టి



ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్తాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి.

# మహిళలపై అకృత్యాలకు చర్యలేవీ

**- కఠినంగా శిక్షలు వేస్తేనే మార్పు సాధ్యం**

**అమరావతి,సెప్టెంబర్18( వెలుతురు):**

ఇటీవల నల్లగొండలో ఫోక్సో కోర్టులు రేపిస్టులకు జైలుశిక్షలు వేశాయి. సీవిత ఖైదు విధించాయి. అయితే ఇవన్నీ ఆలస్యంగానే అమలవుతున్నాయి. కఠిన శిక్షలు వెంటనే అమలు కావాల్సిన అసవరం ఉంది. ఎన్ని కఠిన చట్టాలను తీసుకుని వచ్చినా లైంగిక వేదింపులు, ప్రేమదాడులు ఆగడం లేదు. అలాగే వరుస ఘటనలు ఎపిలో ఆందోళన కలిగిస్తున్నాయి. మృగాళ్ల కారణంగా ఆడపిల్లలకు భయం కలుగుతోంది. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు మరింత క్షోభకు గురవుతున్నారు. ఇప్పుడు భయపడేలా పరిస్థితులు దాపురించాయి. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు కఠిన శిక్షలు పడేలా చూడాలని సత్వర శిక్షలు అమలు చేయాలని యావత్ దేశం కోరుకుంటున్న వేళ కఠిన చట్టాలపై ఆలోచన చేయాలి. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడితే ఉరిశిక్ష విధించేలా చట్టాన్ని రూపొందించాలి. దీనిని నిర్దారించే ఆధారాలున్నప్పుడు 21 రోజుల్లోనే తీర్పు ఇచ్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలి. మహిళలపై



అత్యాచారానికి పాల్పడితే అతి త్వరగా నిందితులకు మరణశిక్ష పడేలా చట్టం తీసుకుని రావాలి ఇటువంటి కేసుల్లో నిందితులను దోషులుగా నిర్ధారించే ఆధారాలున్నప్పుడు మూడు వారాల్లోగా అంటే 21 వర్కింగ్ డేస్ ల్లో తీర్పు వచ్చేలా క్రిమినల్ లా చట్టంలో మార్పులు తేవాలి.. కానీ ఇటీవలి ఘటనలు మృగాళ్లలో భయాన్ని కలిగించడం లేదని తెలిస్తోంది. ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరకారించందనో లేక తనను ప్రేమించడం లేదనో లేకపోతే..ఒంటరి అమ్మాయిలను లేదా మహిళలను లక్ష్యంగా చేసుకుని రెచ్చిపోతున్నారు. రేప్‌లు చేయడం, హత్యలు చేయడం చాలా సులువైన పనిగా చూస్తున్నారు. మహిళలు, చిన్నారులపై నేరాల విచారణకు ప్రతి జిల్లాలోను ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేయాలి.

అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, లైంగిక వేధింపులు వంటి హింసాత్మక ఘటనల్లో నేరాల విచారణకు ప్రతి జిల్లాల్లోను ప్రత్యే కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వాలు ముందుకు రావాలి. అంతేకాదు సోషల్ మీడియా వేదికగా బాధిత మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలకు అడ్డుకట్టవేసేలా చట్టాన్ని రూపొందించాలి. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా పోస్టింగ్‌లు పెట్టేవారిపై ఉక్కుపాదం మోపాలి. నిజానికి ఆడవాళ్లపై అకృత్యాలు జరిగిన వెంటనే ఉపశమనం కలిగే చట్టం రావాలని తల్లిదండ్రులు, ప్రతి మహిళ, చెల్లి, ప్రతి ఇంట్లోని ఆడపిల్ల ఎదురు చూస్తోంది. ప్రభుత్వం కఠిన చట్టంతో మహిళలకు భద్రత ఇస్తోందన్న భరోసా రావాలి. అయితే చట్టాలు ఉన్నా ప్రజల్లో మార్పులు మాత్రం రావడం లేదు. దుండగులను కఠినంగా అణచివేస్తే తప్ప మహిళలకు రక్షణ ఉండదని తేలిపోయింది. కఠినంగా అణచివేత చర్యలకు ఉపక్రమించాలన్ని సర్వత్రా విజ్ఞప్తులు వస్తున్నాయి. భయం కలిగేలా పోలీసులు వ్యవహరించాలని కూడా యువతులు కోరుకుంటున్నారు.

## వైకాపా హయాంలో భారీ లిక్కర్ స్కామ్

**- సిట్ విచారణ జరుగుతోంది**

**- త్వరలోనే వాస్తవాలు ప్రజల ముందుకు**

**- పారదర్శకంగా లిక్కర్ పాలసీ అమలు**

**- మండలిలో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి**



**అమరావతి,సెప్టెంబర్18( వెలుతురు):**
వైకాపా ప్రభుత్వంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారన్నారు. ఇందులో వందలకోట్లు దుర్వినియోగం జరిగిందని అన్నారు. బెల్టుషాపులు, నకిలీ మద్యం అమ్మకాలపై శాసన మండలిలో చర్చ సందర్భంగా వైకాపా ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, శివరామిరెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. మద్యం విషయంలో అంతా మంచి జరిగిందని వైకాపా చెప్పడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. మద్యం కుంభకోణంపై సిట్ విచారణ జరుగుతోంది.. త్వరలో వాస్తవాలు బయటకు వస్తాయని మంత్రి అన్నారు. మద్యం దుకాణదారులు తప్పు చేస్తే జరిమానా, రెండోసారి తప్పు చేస్తే లైసెన్స్ సస్పెండ్ చేస్తున్నాం. సరఫరా పర్యవేక్షణకు పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు- చేసి అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో లిక్కర్ పాలసీని చాలా పారదర్శకంగా అమలు చేస్తున్నాం. మనం అమలు చేసే పాలసీని పక్క రాష్ట్రాలు కూడా అధ్యయనం చేస్తున్నాయి. మద్యాన్ని ఆదాయ వనరుగా ప్రభుత్వం ఎప్పుడూ చూడలేదు. నాసిరకం మద్యం అమ్మినవారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో లిక్కర్ వల్ల చనిపోయినట్లుగా ఎక్కడా కేసు నమోదు కాలేదని కొల్లు రవీంద్ర తెలిపారు.

## యూరియా కొరతపై వైసిపి వాయిదా తీర్మానం

**- మండలిలో చర్చకు పట్టుబట్టిన వైకాపా సభ్యులు**

**- గందరగోళం మధ్య పది నిముషాలు వాయిదా**





**అమరావతి,సెప్టెంబర్18( వెలుతురు):**
ఏపీ శాసనమండలి సమావేశాలు ప్రారంభమైన కొద్ది సేపటికే వైసీపీ సభ్యుల ఆందోళనతో వాయిదా పడింది. సభ మొదలవగానే యూరియా కొరత, గిట్టుబాటు- ధరలపై వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. అయితే వైసీపీ వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించారు. దీంతో వైసీపీ సభ్యులు సభలో నినాదాలు చేశారు. అయితే యూరియా, గిట్టు-బాటు- ధరలపై సమయం కేటాయించాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. చర్చకు తాము రెడీ అంటూ సమాధానం ఇచ్చారు. ఎవరి ప్రభుత్వంలో ఏం చేశారు అనేది చర్చలో తేలుద్దామంటూ మంత్రి సవాల్ విసిరారు. యూరియా, పంటలకు గిట్టు-బాటు- ధరలపై బీఏసీ సమావేశంలో సమయం కేటాయిస్తే ఎన్ని గంటలు అయినా చర్చ చేయడానికి ప్రభుత్వం సిద్ధం అని అచ్చెన్న స్పష్టం చేశారు. అయితే మంత్రి సమాధానం చెప్పినప్పటికీ వైసీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ చైర్మన్ పోడియం వద్ద ఆందోళనకు దిగారు. యూరియా కొరత సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేశారు. పంటలకు గిట్టు-బాటు- ధరలు లేవంటూ సిగ్గు సిగ్గు చైర్మన్ పోడియం దగ్గర నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు వైసీపీ సభ్యులు. అయితే వైసీపీ ఎమ్మెల్సీలకు టీ-డీపీ ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ స్ట్రాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వసతులు కల్పించక పోవడం సిగ్గు సిగ్గు అంటూ ప్రశ్న అడుగుతూ వ్యాఖ్యానించారు ఎమ్మెల్యే. కాగా.. బీఏసీ సమావేశంలో సమయం కేటాయిస్తే చర్చించేందుకు తాము సిద్ధం అని మంత్రి చెబుతున్నారని వైసీపీ ఎమ్మెల్సీలకు నచ్చచెప్పేందుకు చైర్మన్ ప్రయత్నించారు. అయినా వైసీపీ సభ్యులు నినాదాలు ఆపని పరిస్థితి. మరోవైపు సభలో వైసీపీ సభ్యుల నినాదాలకు పోటీగా టీడీపీ సభ్యులు కూడా నినాదాలు చేశారు. రైతు ద్రోహి జగన్ అంటూ కావలి గ్రీష్మ నినాదాలు చేశారు. ఈ క్రమంలో సభలో పరిస్థితి గందరగోళంగా మారడంతో మండలి చైర్మన్ సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు.

## ప్రతిపక్షహోదా కాదు..సభకు వచ్చి మాట్లాడు

**- సభకు రాకుండా హోదా కావానడం సిగ్గుచేటు**

**- ఇలాంటి వారి గూబ పగులగొట్టాలన్న అచ్చన్న**

**అమరావతి,సెప్టెంబర్18( వెలుతురు):**



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ ప్రతిపక్ష హోదా అడగడం పట్ల మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ప్రతిపక్ష హోదా అడుగుతున్న జగన్ చెంప పగలగొట్టాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 11 సీట్లు- వచ్చిన పార్టీ నేతలు ప్రతిపక్ష హోదా అడుగుతుంటే గూబ పగలగొట్టాలి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓడిపోయిన నాయకుడు అసెంబ్లీలోకి వచ్చి కూర్చుంటే ఎంత తప్పో ... జగన్ ప్రతిపక్ష హోదా అడగటం కూడా అంతే తప్పు అని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేల అనర్హత వేటుపై అసెంబ్లీలో చర్చించి స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని.. అది స్పీకర్ పరిధిలోని అంశమని వెల్లడించారు. జగన్ ప్రతిపక్ష హోదా అడగటం మానేసి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలి అంటూ అచ్చెన్నాయుడు హితవుపలికారు. వైసీపీ నేతలపై శాసనమండలి చీఫ్ విప్ పంచమర్తి అనురాధ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన జగన్, వైసీపీ నేతలు బావిలో దూకాలంటూ మండిపడ్డారు. పోలవరం కట్టనందుకు జగన్ బావిలో దూకాలన్నారు. శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు పిచ్చి పిచ్చి ప్రశ్నలు అడిగి సమాధానం వినకుండా సభ నుంచి పారిపోతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. వార్డు మెంబర్గా కూడా గెలవని సజ్జల కూటమిపై విమర్శలు చేస్తున్నారన్నారు. వైసీపీ నేతలు బయట ఉండి పిచ్చిపిచ్చి విమర్శలు చేస్తే సహించమని.. సభకు వచ్చి మాట్లాడాలని అనూరాధ హితవు పలికారు.

## ప్రతిపక్ష హోదా కోసం పట్టుబట్టమేంటి

**- ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక అసెంబ్లీకి రావాల్సిందే**

**- జగన్, కెసిఆర్ల తీరుపై మండిపడ్డ నారాయణ**

**విజయవాడ,సెప్టెంబర్18( వెలుతురు):**
తెలుగు రాష్ట్రాల్లో మాజీ ముఖ్యమంత్రులు అసెంబ్లీకి రాకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి ఇరు రాష్ట్రాల మాజీ సీఎంలు అసెంబ్లీకి ముఖం చూపించిన దాఖలాలే లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన.. ప్రజా సమస్యల తరఫున వారు మాట్లాడక పోవడంతో.. నియోజకవర్గ ప్రజల్లో నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతుంది. అయితే.. ఏపీలో మాజీ సీఎం జగన్ తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతానంటూ.. భీష్మించుకుని కూర్చున్న సంగతి తెలిసిందే. రాజ్యాంగంలో ప్రతిపక్ష హోదాకు ఉన్న నియమ నిబంధనల ప్రకారం జగన్కు ప్రతిపక్ష హోదా ఇచ్చేది లేదని కూటమి ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. మరోపైపు తెలంగాణలో మాజీ



సీఎం కేసీఆర్ తన అనారోగ్య సమస్యల వల్ల అసెంబ్లీ సమావేశాలకు రాలేకపోతున్నానని.. కాలం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల మాజీ సీఎంలపై సీపీఐ నేత నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో పోటీ- చేసి ఎమ్మెల్యేలుగా గెలిచిన మాజీ సీఎం జగన్ రెడ్డి, తెలంగాణ మాజీ సీఎం చంద్రశేఖర్ రావులు అసెంబ్లీకి రావాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీకి రాకపోవడం అంటే.. మీకు ఓటు- వేసిన ప్రజానీకాన్ని మోసం చేయటడమే అని మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా ఇవ్వలంటే కొన్ని లెక్కలు వుంటాయని.. అవేవి తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచి అధికారం వస్తే అసెంబ్లీకి వస్తారు.. లేకపోతే ముఖం చాటేస్తారా అని నిలదీశారు. అధికారం ఉన్నా లేకపోయినా అసెంబ్లీకి రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలుగా గెలిచి అసెంబ్లీకి రాకపోవటం అంటే.. పెళ్లి చేసుకుని కాపురానికి రాకపోవటమే అని నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు.


## ఎపి లిక్కర్ స్కామ్ కేసులో ఇడి దాడులు

**- ఏకకాలంలో 20 చోట్ల పెద్ద ఎత్తున తనిఖీలు**

**- సిట్ నివేదిక ఆధారంగా రంగంలోకి దగిన ఇడి**

**అమరావతి,సెప్టెంబర్18( వెలుతురు):**
రూ.3,500 కోట్ల విలువైన ఏపీ లిక్కర్ స్కామ్ అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, దిల్లీలో ఈడీ తనిఖీలు చేపట్టింది. మద్యం కుంభకోణం కేసులో నిందితుల సంస్థలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. మరోవైపు ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చింది. 12 మందిని అరెస్టు చేసింది. ధనుంజయరెడ్డి (ఏ-31), కృష్ణమోహన్రెడ్డి (ఏ-32), బాలాజీ గోవిందప్ప (ఏ-33), పైలా దిలీప్ (ఏ-30)లు బెయిల్పై బయటకు రాగా.. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్నాయుడు సహా మొత్తం 8 మంది ఇంకా జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏకకాలంలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీలలోని 20 ప్రాంతాల్లో దాడులు జరిగాయి. మద్యం కుంభకోణం నిందితుల సంస్థలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. లిక్కర్ స్కాంలో ఉన్న నిందితుల ఇళ్లలోనూ ఈడీ సోదాలు జరిగాయి. నకిలీ ఇన్వాయిస్లు, పెంచిన మద్యం ధరల వెనుక భారీ స్కాం జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చి.. 12 మందిని అరెస్టు చేసింది.ఏపీ మద్యం కుంభకోణం మొత్తం విలువ రూ. 3,500 కోట్లుగా ఈడీ అంచనా వేసింది. నకిలీ ఇన్వాయిస్లు, పెంచిన బిల్లుల ఆధారంగా కిక్ బ్యాక్లు చెల్లింపులు జరిగాయని దర్యాప్తులో బయటపడింది. పలు కంపెనీలు, మద్య వ్యాపారాలకు సంబంధించిన కీలక వ్యక్తులు ఈ స్కాంలో ప్రమేయం ఉన్నట్లు- అనుమానం వ్యక్తం చేస్తోంది. ఫ్రంట్ కంపెనీలు ద్వారా డబ్బు లావాదేవీలు జరిగాయని ఈడీకి ఆధారాలు లభించాయి. కిక్ బ్యాక్ల





కోసం తప్పుడు ఖర్చుల చూపులు, మేనిప్యులేటెడ్ బిల్లులు వాడారని ఆరోపణలు ఉన్నాయి. నిందితుల ఇళ్లు, ఆఫీసులు, గోదాములు, సంబంధిత అకౌంటింగ్ సంస్థల ప్రాంగణాల్లో శోధనలు జరుగుతున్నాయి.ఏపీ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ రిపోర్టులు, ఐటీ- శాఖ సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. కుంభకోణంలో రాజకీయ సంబంధాల కోణాన్ని కూడా పరిశీలిస్తోంది. ఈడీ దాడుల్లో పెద్ద మొత్తంలో డాక్యుమెంట్లు-, డిజిటల్ డేటా, లావాదేవీల రికార్డులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. హవాలా మార్గంలో సుమారు వందల కోట్ల సొమ్ము తరలింపులు జరిగాయని అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ దాడులు మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు- సమాచారం. ఈ కేసుకు సంబంధించిన ఇప్పటికే పలువురు నిందితులు.. ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలు అరెస్ట అయి.. బెయిల్పై జైలు నుంచి విడుదలయ్యారు. ఇక ఇదే కేసులో అరెస్ట్ అయి.. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి సైతం బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాంటి వేళ.. ఈ మద్యం కుంభకోణంలో దర్యాప్తు చేసేందుకు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. ఆ క్రమంలో చెన్నై, హైదరాబాద్, న్యూఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు గురువారం ముమ్మర దాడులు నిర్వహించారు. దాదాపు 10 బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నట్లు- తెలుస్తోంది. ముఖ్యంగా ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి ఆస్తులపై ఈడీ దృష్టి సారించినట్లు- సమాచారం. మద్యం వ్యవహారంలో పొందిన ముడుపులను షెల్ కంపెనీలకు పంపిన తద్వారా నల్ల ధనాన్ని వైట్గా మార్చారంటూ ఇప్పటికే రాజ్ కసిరెడ్డిపై సిట్ నిగ్గు తేల్చింది. ఈ వ్యవహారానికి సంబంధించి.. సిట్ నుంచి ఈడీ సీనియర్ అధికారులు అందుకు సంబంధిందచిన సమగ్ర సమాచారాన్ని మూడు రోజుల క్రితమే తీసుకున్నట్లు- తెలుస్తోంది. మొత్తం 23 సూట్ కేసు కంపెనీలలో జరిగిన లావాదేవీలపై ఈడీ ఈ సందర్భంగా దృష్టి సారించినట్లు- తెలుస్తోంది. అలాగే ఇప్పటి వరకు సిట్ దాఖలు చేసిన చార్జిషీట్లోని నిందితుల ఆస్తులు, కంపెనీలపై సైతం ఈడీ దృష్టి సారించింది. అదే విధంగా హైదరాబాద్లో సిట్ స్వాధీనం చేసుకున్న రూ. 11 కోట్ల నగదు వివరాలను సైతం ఈడీ అధికారులు అడిగి తెలుసుకున్నట్లు- తెలుస్తోంది. ఈ దాడులు సమయంలో ఎప్పటికప్పుడు సిట్ అధికారులతో సంప్రదిస్తూ.. తమకున్న సందేహాలను ఈడీ అధికారులు నివృత్తి చేసుకుంటున్నారని సమాచారం. తిరుపతి, హైద్రాబాద్లోని మరి కొన్ని కంపెనీలపై కూడా ఈ దాడులు చేసేందుకు మరిన్ని బృందాలు ఇప్పటికే ఢిల్లీ నుంచి బయలు దేరినట్లు- తెలుస్తుంది. అందుకోసం ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు తిరుపతిలో పలు బృందాలు ఎదురు చూస్తున్నాయి

## అర్హులందరికీ పెన్షన్ ఇస్తున్నాం

**- 11,98,501 మంది పింఛన్ సౌకర్యం**

**- ఎవ్వరినీ కూడా జాబితా నుంచి తొలగించలేదు**

**- మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి శ్రీనివాస్ సమాధానం**

**అమరావతి,సెప్టెంబర్18( వెలుతురు):**
అర్హులయిన వారికి పింఛన్లు ఎక్కడా తొలగించలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఎవరైనా చనిపోతే వెంటనే ఆ కుటుంబంలో మరొకరికి ఇస్తున్నామని చెప్పారు. అనర్హులకు మాత్రమే నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. పింఛను పథకంపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు సమయంలోపలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 50-59 ఏళ్ల మధ్య ఉన్న 11,98,501 మంది పింఛను పొందుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదలకు ఇచ్చే పింఛన్లను రూ.3వేల నుంచి రూ.4వేలకు ఒకేసారి పెంచామన్నారు. అనర్హులకు నోటీసులు ఇచ్చి 2 నెలల్లో రీ వెరిఫికేషన్ చేయాలని వైద్యశాఖకు సూచించామని తెలిపారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం పింఛన్లు ఇస్తోందన్నారు. శాసనమండలి సమావేశాల్లో ప్రశ్నోత్తరాల్లో 50 ఏళ్లకు పింఛన్



పథకంపై చర్చ జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. 50-59 వయసు మధ్య ఉన్నవారు 11,98,501 మంది పింఛన్ పొందుతున్నారని.. ప్రతి నెలా ఒకటో తేదీన పేదలకు పింఛన్లు ఇస్తున్నామని వెల్లడించారు. వృద్ధులకు ఇచ్చే పింఛన్లను 3 వేల నుంచి 4 వేలకు ఒకేసారి పెంచామని... అర్హులకు ఎక్కడా పింఛన్లు తొలగించలేదని స్పష్టం చేశారు. పెన్షన్ తీసుకునే భర్త చనిపోతే భార్యకు స్పౌజ్ పెన్షన్ అందిస్తున్నామన్నారు. పెన్షన్లను 200 నుంచి వెయ్యి రూపాయలు చేసినా, ఆ తర్వాత నాలుగు వేలు చేసినా, 15 వేల వరకు పెన్షన్ అందిస్తోన్న ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదే అని మంత్రి చెప్పుకొచ్చారు. పెన్షన్లు పెంచుకుంటూ పోతామని మాయ మాటలు చెప్పలేదన్నారు. అత్యవసర పరిస్థితిలో ఊరు దాటి వెళ్ళిన వాళ్లకు మూడు నెలలు సమయం ఇచ్చామని.. తెలిపారు. అర్హులకు ఎక్కడా పెన్షన్లను తొలగించలేదని, ప్రతీ అర్హుడికి ఈ ప్రభుత్వంలో పెన్షన్ అందుతుందని స్పష్టం చేశారు. చేనేత కార్మికులకు 50 సంవత్సరాల వయస్సు వారికి ఫించన్ మంజూరు చేశామన్నారు. ఆదివాసి గిరిజనులకు, కల్లు గీత కార్మికులకు పెన్షన్లను మంజూరు చేస్తున్నామని మంత్రి కొండపల్లి చెప్పారు. పెన్షన్ల పంపిణీపై వైసీపీ తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవుపలికారు. మూడు వేల పెన్షన్ను 5 వేలు పెంచారని, ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు నెలల పెంచిన పెన్షన్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో డయాలసిస్ చేయించు కుంటున్న వారికి వయస్సుతో సంబంధం లేకుండా పెన్షన్ ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదే అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు.

## పదిరోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు

**- బిఎసి సమావేశంలో నిర్ణయం**

**అమరావతి,సెప్టెంబర్18( వెలుతురు):**
ఏపీ అసెంబ్లీ సమావేశాలు 10 రోజుల పాటు- నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. . సభలో చర్చించేందుకు 18 అంశాలను తెదేపా ప్రతిపాదించింది. గురువారం ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాలు ఈనెల 30వ తేదీ వరకు జరగనున్నాయి. 10 రోజుల పాటు- అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడి అధ్యక్షతన జరిగిన శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ- భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు- మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్,



ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, విష్ణుకుమార్ రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై తుది నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్ లు తగ్గించడంతో ధరలు తగ్గడం, ప్రజలకు కలిగిన లాభంపై ఇవాళ్టి సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటన చేయనున్నారు. ఈ ప్రకటనపై పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడనున్నారు. కేంద్రాన్ని అభినందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం ఇవ్వనున్నారు. అలాగే, జలవనరుల శాఖపై నేడు చర్చ జరపనున్నారు. ఈ నెల 22న శాంతి భద్రతలు, 23న వైద్యారోగ్యం, 24న పరిశ్రమలు, 25న సూపర్ సిక్స్ పథకాలు, 26న క్వాంటం, 27న లాజిస్టిక్స్, 29న స్వర్ణాంధ్ర దిశగా ఏపీ, 30వ తేదీన రాయలసీమ- కోస్తా- ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ నెల 20, 21, 28 తేదీల్లో అసెంబ్లీకి సెలవులు ఇచ్చారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అసెంబ్లీ సమావేశాలు జరపాలని బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రశ్నోత్తరాలతో పాటు జీరో అవర్ లోనూ సభలో మంత్రులు ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అసెంబ్లీలో చర్చించేందుకు 9 అంశాలను బీజేపీ ప్రతిపాదించింది.

# ఇరిగేషన్‌ను నాశనం చేసిన వైకాపా

**- సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామన్న గొట్టిపాటి**



**అమరావతి,సెప్టెంబర్18( వెలుతురు):**

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇరిగేషన్ రంగాన్ని విధ్వంసం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.. కూటమి ప్రభుత్వం చివరి ఎకరం వరకు సాగు నీరందించేలా ఇరిగేషన్ శాఖను గాడిలో పెడుతోందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారాయన. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఆర్ వంశధార, తోటపల్లి, వంశధార-నాగావళి లింక్, జంఝావతి, హిరమండలం లిఫ్ట్, నాగావళి- చంపావతి, మహేంద్ర తనయ, తరకరామతీర్థసాగర్ వంటి కీలకమైన ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి నిమ్మల తెలిపారు.. రెండేళ్ళలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 2వేల కోట్ల నిధులు కేటాయించారన్నారు..రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థం 5006.35 మెగావాట్లుగా ఉందని మంత్రి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు రాష్ట్రం ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 ను తీసుకొచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ పాలసీ ద్వారా రాష్ట్రంలో సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని 78.50 గిగావాట్లు-కు పెంచే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని పెంచకుండా, 9 సార్లు చార్జీలు పెంచి ప్రజల మీద భారం వేసింది రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, 2029 నాటికి ప్రభుత్వం లక్ష్యంపై బత్తుల బలరామకృష్ణ అడిగి ప్రశ్నకు గొట్టి పాటి సమాధానమిచ్చారు.

# జిఎస్టీ సంస్కరణలకు ఎపి తొలిమద్దతు

**- ప్రజలకు మేలు కలిగించాలన్నదే లక్ష్యం**

**- సంస్కరణలతో ప్రజల ఆదాయం మెరుగవుతుంది**

**- శాసనభలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**



**అమరావతి, సెప్టెంబర్18 వెలుతురు:**

రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా జీఎస్టీ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఏపీనే అని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. జీఎస్టీ పన్నుల నూతన విధానం ద్వారా ప్రజలకు మేలు చేసే విధానం మంచిదని.. దీనివల్ల దేశం స్థిరమైన వృద్ధి పెరుగుతోందని చెప్పుకొచ్చారు.జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఏపీ శాసనసభలో డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ తీర్మానం చేశారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జీఎస్టీ సంస్కరణలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటనను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. జీఎస్టీ మండలి 56వ సమావేశంలో జీఎస్టీ సంస్కరణలను కేంద్రమంత్రి నిర్మాలా సీతారామన్ ఆమోదించారని గుర్తుచేశారు. ఇది ప్రజలు, ఆర్థిక వ్యవస్థకు చాలా లాభదాయకని నొక్కిచెప్పారు. వ్యవసాయ పనిముట్లు-, యంత్రాల రేట్లు తగ్గి ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. పాలు, పెరుగుపై పన్ను 5శాతం నుంచి సున్నా శాతానికి అలాగే నిత్యావసరాల ధరలు చాలా వరకూ 18 నుంచి 5శాతానికి తగ్గుతున్నాయని గుర్తుచేశారు. సిమెంట్‌పై పన్నును 28 నుంచి 18కి తగ్గించారని తెలిపారు. అత్యవసర మందులపై జీఎస్టీ పన్ను లేకుండా చేయడం ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజల చేతిలో సంపద పెరిగి వస్తువుల వాడకం పెరుగుతుందని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. జీఎస్టీ విషయంలో అన్ని వాణిజ్య, వ్యాపార సంఘాలు అంగీకారం తెలిపినందుకు ఏపీ ప్రభుత్వం తరపున ధన్యవాదాలు చెబుతున్నట్లు- పేర్కొన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ ఏపి బెనిఫిట్స్ జీఎస్టీ సంస్కరణల ద్వారా అమలు అవుతాయో తెలియజేయాల్సిన అవసరం కూడా ఉందని నొక్కి చెప్పారు పవన్. పరస్పర అవగాహనతోపాటు- మీడియా వేదిక ద్వారా ప్రజలకు లాభాల గురించి తెలియజేయాలని కోరారు. జీఎస్టీ సంస్కరణలపై ఏపీ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# మరోమారు నగరంలో భారీ వర్షం

**- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వరదనీరు**

**- వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు**



**హైదరాబాద్,సెప్టెంబర్18( వెలుతురు):**

నగరంలో మరోసారి భారీ వర్షం అతలాకుతలం చేసింది. బుధవారం రాత్రికురిసిన వర్షం నుంచి తేరుకోక ముందే గురువారం సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా వర్షం దంచికొట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్, పంజాగుట్ట, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఐటీ- కారిడార్‌తో పాటు- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరికొన్ని గంటలపాటు- వర్షం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చేందుకు అవకాశముండడంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఫిల్మ్‌నగర్, ఎర్రగడ్డ, యూసఫ్‌గూడ, అమీర్‌పేట, బోరబండ, చార్మినార్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో మూడు రోజుల పాటు- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. గంటలకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

# సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యం

**- రాహుల్ విమర్శలను ఖండించిన ఇసి**

**- అబద్దాల ప్రచారంతో అస్థిరత సృష్టించే యత్నం**

**- రాహుల్ విమర్శలపై మండిపడ్డ బిజెపి నేతలు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్18 వెలుతురు:**

ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు.. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరని కూడా వివరించింది. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ గెలుపొందారని ఈసీ వెల్లడించింది. ఇలా తొలగంపు అన్నది జరగదని కూడా ఇసి స్పష్టం చేసింది. ఇదిలావుంటే ఓట్ల తొలగింపు అంటూ రాహుల్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని భాజపా దుయ్యబట్టింది. రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడం లేదు. 2014 నుంచి మోదీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని




కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా..? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీ స్థాయికి వస్తామనేలా వారి మాటలు ఉండాలి. అంతేకానీ దానికి బదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరుకుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారని ఢిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్, నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించాని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90 ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయన అసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టు మందలింపులు ఆయనకు పరిపాటిగా మారిపోయాయని అన్నారు.

# ఆల్మట్టి ఎత్తు పెంచుతున్నా పట్టించుకోరా

**- కృష్ణా జలాల వాటా వదులకోమన్న సిఎం చేస్తున్నదేంటి**

**- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ మాజీ ఎంపి వినోద్**

**హైదరాబాద్,సెప్టెంబర్18( వెలుతురు):**

అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తుంటే.. ఇప్పటికీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడంపై బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. కృష్ణా ట్రిబ్యునల్ 2013లో అల్మట్టి ప్రాజెక్టు ఎత్తుకు సంబంధించి తీర్పు ఇచ్చింది. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ తీర్పుపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఆందోళనల నేపథ్యంలో అప్పటి ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ వేస్తే ట్రిబ్యునల్ తీర్పుపై స్టే వచ్చింది. 2014లో తెలంగాణ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టు స్టే కొనసాగించేలా చర్యలు చేపట్టింది. సుప్రీం కోర్టు స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు ప్రయత్నిస్తోంది. నిన్న కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి ప్రాజెక్టు విస్తరణ కోసం లక్షా 33 వేల ఎకరాల భూ సేకరణ చేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. ఈ భూ సేకరణ కోసం రెండేళ్లలో రూ. 70 వేల కోట్లు- ఖర్చు పెట్టాలని కర్ణాటక లక్ష్యంగా పెట్టు-కుంది. కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే. కర్ణాటక అల్మట్టిపై



నిర్ణయం తీసుకుని రెండు రోజులు అవుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ఇంకా స్పందించలేదు. సుప్రీంకోర్టు స్టే పెండింగ్‌లో ఉండగానే కర్ణాటక అల్మట్టి ఎత్తు పెంచడానికి తీసుకున్న నిర్ణయంపై తక్షణమే మన రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. కృష్ణా నదిలో ఒక్క నీటి చుక్కను వదులుకోమని ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ఓ సమీక్ష సమావేశంలో చెప్పారు. మరి కర్ణాటక అక్రమంగా అల్మట్టి ఎత్తు పెంచుతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ కర్ణాటక నిర్ణయంపై స్పందించారు. అల్మట్టి ఎత్తు పెంచితే తమ రాష్ట్రంలోని రెండు జిల్లాలు సాంగ్లీ, కొల్హాపూర్ జిల్లాల్లో ముంపు ఉంటు-ందని మహారాష్ట్ర సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అల్మట్టి ఎత్తు పెంపును ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని అడ్డుకుని తీరుతామని ఫడ్నవీస్ హెచ్చరించారు అని వినోద్ కుమార్ గుర్తు చేశారు. కేసీఆర్‌పై ద్వేషమే తప్ప రేవంత్ రెడ్డికి కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయాలని లేదు. కేసీఆర్ పట్టు-దలతోనే సెక్షన్ 3 ప్రకారం కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదనలు జరుగుతున్నాయి. కేసీఆర్ కృష్ణా ట్రిబ్యునల్ కోసం 33 లేఖలు కేంద్ర ప్రభుత్వానికి రాశారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తగ్గించారని కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి పదే పదే నిందలు వేస్తున్నారు. నిన్న కూడా సెప్టెంబర్ 17 వేడుకల ప్రసంగంలోనూ కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి విషం చిమ్మారు. తెలంగాణ ఏర్పడ్డ నెల రోజులకే కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు- కోసం లేఖ రాశారు. కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు-ను మహారాష్ట్ర, కర్ణాటక వ్యతిరేకించినా కేసీఆర్ మాటనే చివరకు నెగ్గింది. కేసీఆర్‌పై నిందలు మాని అల్మట్టిపై కర్ణాటక దూకుడును రేవంత్ రెడ్డి అడ్డుకోవాలి. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందుకే రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారా..? రేవంత్ రెడ్డి ఇప్పటి-కై-నా సుప్రీంకోర్టులో కర్ణాటకకు వ్యతిరేకంగా కంటెంప్ట్ పిటిషన్ వేయాలి. అల్మట్టి ఎత్తు పెరిగితే తెలంగాణకు భారీ నష్టం వాటిల్లుతుంది.. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించాలి అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

# శాంతియుత వాతావరణంలో దసరా ఉత్సవాలు

**- పీస్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పిలుపు**

**విజయవాడ,సెప్టెంబర్18( వెలుతురు):**

పర్వదినాలు మతసామరస్యానికి ప్రతీకలని.. ఐక్యత, సోదరభావంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు. గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన శాంతి కమిటీ-సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రతి పండగనూ జరుపుకుంటున్నామని.. ఇదే స్ఫూర్తితో దసరా ఉత్సవాల విజయవంతానికి చేయీచేయీ కలుపుదామని, జిల్లాను ఆదర్శవంతంగా నిలబెడదామని పేర్కొన్నారు. సోదరభావం, ఐక్యత సుస్థిర ప్రగతికి సోపానాలని.. ఈసారి దసరా ఉత్సవాలకు 15 లక్షల మందికి పైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చేందుకు అవకాశముందని.. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు- చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ భక్తులకు విజయవాడ పర్యటన మధురానుభూతులను మిగిల్చేలా



చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతి కమిటీ- స్ఫూర్తికి అనుగుణంగా ముందడుగు వేద్దామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తిచేసే వారిపై పటిష్ట నిఘా ఉంటు-ందని.. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిభావంతో ప్రతి పండగనూ, ఉత్సవాలను జరుపుకుంటామని.. ఇలాంటి వాతావరణానికి ఇబ్బంది కలిగించాలని ప్రయత్నించే వారిపై డేగ కన్ను ఉంటు-ందని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, పార్కింగ్ సదుపాయాలు, సీసీటీ-వీలు, డ్రోన్లతో నిఘా.. ఇలా ప్రతివిషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలతో చర్యలు తీసుకుంటు-న్నామని వివరించారు. విజయవాడ శాంతియుత వాతావరణానికి ప్రతీక అని.. దసరా ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక భాగస్వాములమవుతామని వివిధ మతాల పెద్దలు పేర్కొన్నారు. తమనుంచి పూర్తి సహాయసహకారాలు ఉంటాయన్నారు. బుడమేరు వరదల సమయంలో ఐక్యతా భావంతో బాధితులకు అండగా నిలిచామని.. ఇలాంటి స్ఫూర్తితోనే ముున్ముందుకూడా అడుగులు వేస్తామన్నారు. సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీసీపీ కేజీవీ సరిత, ఎండోమెంట్ ఏసీ ఎన్.షణ్ముగం, డీఎండబ్ల్యూ అబ్దుల్ రబ్బానీ, వివిధ మతాల పెద్దలు తదితరులు హాజరయ్యారు.

# లిక్కర్ స్కామ్ కేసులో సిట్ కస్టడీకి మిథున్ రెడ్డి

**- రెండ్రోజులు కస్టడీకి అనుమతించిన ఎసిబి కోర్టు**

**విజయవాడ,సెప్టెంబర్18( వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టిస్తోన్న ఏపీ లిక్కర్ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది.. ఈ కేసులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మిథున్ రెడ్డిని పోలీస్ కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.. లిక్కర్ కేసులో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని 5 రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది సిట్.. అయితే, సిట్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఏసీబీ కోర్టు.. మిథున్‌రెడ్డిని రెండు రోజుల పాటు- కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది.. మిథున్ రెడ్డిని రెండు రోజుల పాటు అంటే ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజులు కస్టడీకి ఇస్తూ ఆదేశాలు ఇచ్చింది.. ప్రస్తుతం రాజమండ్రి జైల్లో ఉన్న మిథున్ రెడ్డిని ఏసీబీ కోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 19న ఉదయం 8 గంటలకు కస్టడీలోకి తీసుకోనున్నారు.రెండు రోజుల పాటు- ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కస్టడీకి ఇస్తూ ఆదేశాలు ఇచ్చింది ఏసీబీ కోర్టు.. గతంలో ఎంపీ మిథున్‌రెడ్డిని ప్రశ్నించిన తర్వాతే సిట్ అరెస్ట్ చేసింది..



ప్రస్తుతం ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉండగా..రెండు రోజుల పాటు- మిథున్‌రెడ్డి నుంచి లిక్కర్ స్కాం కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు సిద్ధమైంది సిట్ టీ-మ్.. కాగా, ఏపీలో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కాం కేసులో ఏ-4గా ఉన్నారు ఎంపీ మిథున్ రెడ్డి.. భారత ఉప రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఓటు- హక్కు వినియోగించుకోవాలంటూ గతంలో మిథున్ రెడ్డి కోర్టును ఆశ్రయించగా.. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది కోర్టు.. ఇక, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు- వేసిన అనంతరం సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 5గంటల లోపు రాజమండ్రి సెంట్రల్ జైలులో లొంగిపోవాలంటూ కోర్టు షరతులు విధించగా.. ఆ మేరకు ఆయన కోర్టులో లొంగిపోయిన విషయం విదితమే..

# మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

**- విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం**

**విశాఖపట్టణం,సెప్టెంబర్18( వెలుతురు):**

రాష్ట్రంలో పలుచోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ తుపాన్ హెచ్చరిక కేంద్రం అధికారి తెలిపారు. రాయలసీమ, తెలంగాణ, మరాఠ్వాడ ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని చెప్పారు. రాయలసీమలో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఈ సమయంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్ళకూడదని విశాఖ తుపాన్ హెచ్చరిక కేంద్రం అధికారి హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడటం మంచిది కాదని వ్యాఖ్యానించారు. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. కోస్తాంధ్రలో పలు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

https://epaper.velthuru.com

# వెలుతురు




## సెప్టెంబర్ సినిమాలకు కలసి వచ్చింది

### కిష్కింధపురి సక్సెస్ మీట్‌లో అనిల్ రావిపూడి

ఈ సెప్టెంబర్‌లో థియేటర్‌లు కళకళలాడుతున్నాయని అనిల్ రావిపూడి పేర్కొన్నారు. ఇది సక్సెస్‌ఫుల్ సెప్టెంబర్ అన్నారు. వరుస సినిమాలతో పండగ వాతావరణం నెలకొందని.. ఇదే కొనసాగాలని కోరుకుంటున్నానని అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కిష్కింధపురి' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. తాజాగా ఆడియన్స్‌కు ధన్యవాదాలు చెబుతూ టీమ్ హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు దర్శకుడు అనిల్ రావిపూడి, బాబీ, అనుదీప్, వశిష్ఠలతో పాటు- హీరో సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హారర్ సినిమాలు ఎలా ఉన్నా అందరూ ఆదరణ సొంతం చేసుకుంటాయని అందరూ అనుకుంటారు. కానీ, వాటిలో కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వాళ్ల నాన్న ఎంత పెద్ద నిర్మాతో అందరికీ తెలిసిందే. అయినా సాయి మాత్రం ఏ సినీ నేపథ్యం లేనట్లు- కష్టపడుతుంటాడు. అనిల్ రావిపూడి- చిరంజీవి కాంబినేషన్‌లో రానున్న సినిమాలో కొన్ని సన్నివేశాలు చూశాను. చాలా బాగున్నాయి. కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఈ సినిమాతో విజయాన్ని సొంతం చేసుకున్న నిర్మాత సాహు గారపాటి.. సంక్రాంతికి చిరంజీవి చిత్రంతో మరోసారి మంచి ఫలితాలు చూస్తారని బాబీ నమ్మకంగా చెప్పారు.తెలుగు సినిమాలకు థియేటర్‌లలో జనాలు రావడం లేదని ఈ మధ్య కామెంట్స్ వినిపించాయి. కానీ, సెప్టెంబర్‌ను మాత్రం ఆడియన్స్ సెలబ్రేట్ చేసుకున్నారు. సాయి దుర్గాతేజ్ అంటే నాకు చాలా ఇష్టం. ఒక బ్రదర్‌గా ఆయన ఎప్పుడూ నాకు తోడున్నారని సాయి శ్రీనివాస్ తెలిపారు.







## కల్కి-2 నుంచి తప్పుకున్న దీపిక

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ' పార్ట్-2 నుంచి దీపక తప్పుకున్నారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు- ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ మూవీ టీమ్ సడెన్ షాక్ ఇచ్చింది. దీని సీక్వెల్‌లో దీపికా పదుకొణె నటించడం లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 'కల్కి' సీక్వెల్‌లో దీపిక భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. తొలి భాగం కోసం ఆమెతో సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ రెండో పార్ట్‌లో భాగస్వామి కాలేకపోయింది. గొప్ప టీమ్‌తో కల్కి సీక్వెల్ మీ ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపిక మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం అని వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. నిర్మాణ సంస్థ ప్రకటనతో అభిమానులు షాక్ అవుతున్నారు. గత కొన్ని రోజులుగా దీపికా పేరు నిత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్న విషయం తెలిసిందే. ఇటీ-వల ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ నుంచి వైదొలగినట్లు- కూడా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ భారీ అప్‌కమింగ్ సినిమా నుంచి ఆమె వైదొలగడం చర్చనీయాంశంగా మారింది.

## కిస్ మూవీ ట్రైలర్ విడుదల


తమిళ నటుడు కవిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కిస్'. 'దాదా' సినిమాతో మంచి హిట్ అందుకున్న కవిన్.. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రముఖ కొరియోగ్రాఫర్ సతీష్ కృష్ణన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతుండగా.. రోమియో పిక్చర్స్ బ్యానర్‌పై రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా, సినిమా నుంచి తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో కవిన్.. ప్రేమ, ముద్దు అంటే అస్సలు ఇష్టపడని యువకుడి పాత్రలో కనిపిస్తున్నారు. గతంలో జరిగిన సంఘటనల కారణంగా ప్రేమపై నెగిటివ్ భావాలు ఏర్పడిన అతడి జీవితంలోకి 'ప్రీతి' అనే అమ్మాయి ప్రవేశించిన తర్వాత ఎలాంటి మార్పులు జరిగాయి? అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం.ఈ చిత్రం తెలుగు, తమిళంతో పాటు- హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.




## కుటుంబ గొడవలతో మౌనంగా ఉన్నా


### దక్ష ప్రమోషన్‌లో వెల్లడించిన మంచు లక్ష్మి

ఇంట్లో ఎవరు హిట్ అందుకున్నా.. అది అందరి విజయంగా భావించి ఆనందిస్తానని నటి మంచు లక్ష్మి అన్నారు. తన తండ్రి మోహన్‌బాబుతో కలిసి ఆమె నటించిన యాక్షన్ చిత్రం 'దక్ష' 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రచారంలో ఆమె బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమ కుటుంబంలో జరిగిన గొడవలపై మాట్లాడారు. మిరాయ్' విజయాన్ని నేను కూడా ఎంజాయ్ చేస్తున్నాను. కుటుంబంలో ఎవరికి సక్సెస్ వచ్చినా మా అందరిదిగా భావించి ఆనందిస్తా. ఒకరి కష్టం వృథా కావాలని ఎప్పుడూ కోరుకోను. జీవిత పాఠాలు నేర్చుకోవాలి అనుకుంటాను.. కానీ, కష్టానికి ప్రతిఫలం రాకుండా ఉండాలని ఎప్పుడూ కోరుకోను. ఎందుకంటే ఈ రంగంలో ఎన్ని ఇబ్బందులు ఉంటాయో నాకు తెలుసు. ఒక ఆర్టిస్ట్‌గా వాళ్లకు సలహాలు ఇస్తాను. 'మిరాయ్' సక్సెస్‌ను ఎంజాయ్ చేయమని మొన్న కలిసినప్పుడు కూడా మనోజ్‌కు చెప్పానని అన్నారు. ఒక కుటుంబంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందరూ నలిగిపోతారు. అలా జరగదు అని చెప్పడం అబద్ధం. కానీ, మేము ఉండేది అద్దాల మేడలో.. ఏం చెప్పినా తల, తోక కట్ చేసి వాళ్లకు నచ్చినట్లు- రాసుకునే రోజులివి. అలాంటప్పుడు సైలెంట్‌గా ఉండడమే ఉత్తమం అని నాకు అనిపించింది. అందుకే మౌనంగా ఉన్నాను. గతంలో ఏది ఒప్పు, ఏది తప్పు అని ఆలోచించేదాన్ని. ఇప్పుడు అలా ఆలోచించడం లేదు. దీని వల్ల నేను ఆనందంగా ఉంటానా, బాధపడతానా అని ఆలోచిస్తున్నాను. జీవితంలో ఏదైనా మనకు ఒక పాఠం నేర్పడానికే వస్తుంది. ఏది జరిగినా మౌనంగా ఆలోచిస్తే ప్రశాంతత లభిస్తుందని మంచు లక్ష్మి చెప్పారు.




## ఓజి నుంచి ప్రకాశ్ రాజ్ పోస్టర్ విడుదల

పవన్ కల్యాణ్ హీరోగా 'ఓజీ' సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మేకర్స్ ఓ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇందులో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. చిత్రంలో ఆయన 'సత్య దాదా' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రకాశ్ రాజ్ సీరియస్ లుక్‌లో కనిపించారు. పోస్టర్ ఆధారంగా ఆయన పాత్ర కీలకమని అర్థమవుతోంది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'ఓజీ' రూపొందుతోంది. ఇందులో పవన్ ఇప్పటి వరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంకా మోహన్ నటించారు. ఇమ్రాన్ హష్మీ విలన్. శ్రియారెడ్డి, అర్జున్‌దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.




## కంగనా రనౌత్‌ను చెంపదెబ్బ కొట్టాలి.. కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యలు.. బీజేపీ ఎంపీ రియాక్షన్ ఇదే..!



ప్రముఖ బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై తమిళనాడుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత కేఎస్ అళగిరి వివాదాస్పద వ్యాఖలు చేశారు. బీజేపీ ఎంపీ దక్షిణాదికి వస్తే చెంపదెబ్బ కొట్టాలని అళగిరి అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై పలువురు మండిపడుతున్నారు. అయితే, రూ.100 చెల్లిస్తే మహిళా కార్యకర్తలను నిరసనల్లోనే పాల్గొనేందుకు నియమించుకోవచ్చంటూ కంగనా గతంలో చేసిన ప్రకటనపై అళగిరి స్పందించారు. ఈ సందర్భంగా మండి ఎంపీపై విరుచుకుపడ్డారు. బీజేపీ ఎంపీ అహంకారంతో మాట్లాడుతుందని విమర్శించారు. ఆమె దక్షిణాది రాష్ట్రాల సందర్శనకు వస్తే.. అదే సమయంలో ఆమెను చెంపదెబ్బ కొట్టాల్సిందేంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన గతంలో ఇలాంటి వ్యాఖ్యలు కంగనా గతంలో చేసిందని గుర్తు చేశారు. ఢిల్లీ విమానాశ్రయంలో ఓ మహిళా సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఆమెను చెంపదెబ్బ కొట్టిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల ఉద్యమాన్ని ఉద్దేశించి కంగనా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చెంపదెబ్బ కొట్టిందని.. అవమానించే వ్యాఖ్యలు చేస్తే ఎవరికైనా ఆగ్రహం వస్తుందని అళగిరి తెలిపారు. ఈసారి దక్షిణాదికి వస్తే మరిచిపోకుండా కంగనాను చెంపదెబ్బ కొట్టాల్సిందేనని.. అప్పుడే ఆమెకు తప్పు తెలిసివస్తుందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతల వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలో ఆయన తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు.

అళగిరి వ్యాఖ్యలపై కంగనా రియాక్షన్..

అళగిరి చేసిన వ్యాఖ్యలపై కంగనా రనౌత్ స్పందించింది. భారత్‌లో ఎక్కడికైనా వెళ్లవచ్చని.. ఎవరూ ఆపలేరన్నారు. ద్వేషించే వారు కొందరుంటే.. ప్రేమించే వారు చాలా మందే ఉన్నారన్నారు. వరద బాధితులను కలిసేందుకు వెళ్లిన ఆమె ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. అళగిరి వ్యాఖ్యలపై స్పందించారు. తమిళనాడు సీఎం తలైవి జయలలిత పాత్రను సినిమాలో పోషించానని.. కానీ ఓటింగ్ సమయంలో సభలో ఉన్న ప్రతిపక్ష ఎంపీలు కూడా వరుసలో వెళ్తుండగా.. తనను తలైవి అని సంబోధించారన్నారు. మహిళలపై ఇలాంటి అగౌరవకరమైన వ్యాఖ్యలు చేయకూడదని.. ఇది ప్రజలకు తప్పుడు సందేశాన్ని పంపుతుందన్నారు. ఇదిలా ఉండగా.. కులు జిల్లాలోని మనాలి సబ్ డివిజన్‌లోని సోలాంగ్, పాల్చన్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇక్కడ తన రెస్టారెంట్ ఉందని.. ఇక్కడ కేవలం రూ.50 వ్యాపారం మాత్రమే జరిగిందని.. రూ.15లక్షలు జీతాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. బియాస్ నది ఉప్పొంగుతున్నందున సోలాంగ్ గ్రామంలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఎంపీకి తెలిపారు. నది మార్గాన్ని మళ్లించడానికి నీటిని కాలువ ద్వారా మళ్లించడం తక్షణ పరిష్కారమని సూచించారు.

## ఎఎన్నార్ 101 జయంతి స్పెషల్

### డక్టర్ చక్రవర్తి, ప్రేమాభిషేకం రీ-రిలీజ్

### థియేటర్లలో ఉచితంగా ప్రదర్శన

దివంగత అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి సందర్భంగా అభిమానులకు ప్రత్యేక బహుమతి సిద్ధమైంది. ఆయన నటించిన సూపర్‌హిట్ క్లాసిక్ చిత్రాలు డాక్టర్ చక్రవర్తి, ప్రేమాభిషేకం మళ్లీ పెద్ద తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా, ఈ సినిమాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఎంపిక చేసిన థియేటర్లలో అది కూడా ఉచిత టిక్కెట్లతో ప్రదర్శించనున్నారు. ఇది నిజంగా అభిమానుల్లో విశేష ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ రెండు ప్రసిద్ధ చిత్రాలు సెప్టెంబర్ 20 నుంచి మళ్లీ రీ-రిలీజ్ అవుతున్నాయి. పెద్ద తెరపై ఏఎన్ఆర్ మాయాజాలాన్ని మళ్లీ ఆస్వాదించే అరుదైన అవకాశం ఇది. ఈ ప్రత్యేక ప్రదర్శనలకు టిక్కెట్లు- బుక్ మై షో లో ఉచిత రిజర్వేషన్ కోసం అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు వంటి ప్రధాన నగరాల్లోని ప్రముఖ థియేటర్లలో ప్రదర్శనలు జరగనున్నాయి. వీటిలో వైజాగ్‌లో క్రాంతి థియేటర్, ఒంగోలులో స్వర్ణ ప్యాలెస్, విజయవాడలో కృష్ణ టాకీస్, అలాగే హైదరాబాద్‌లోని ఒక ప్రసిద్ధ థియేటర్ కూడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని కేంద్రాలను జోడించే అవకాశం ఉందని సమాచారం. ఏఎన్ఆర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఆయన నటన, సిల్వర్ స్క్రీన్‌పై సృష్టించిన మాయాజాలాన్ని అభిమానులు మరోసారి ఆస్వాదించనున్నారు. అభిమానులు తమ తమ నగరాల్లోని థియేటర్లకు వెళ్లి, కుటుంబసభ్యులతో కలిసి ఈ క్లాసిక్ సినిమాలను చూసి ఆనందించాలని పిలుపునిచ్చారు.



# ఐటీబీపీ జవాన్లరా మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటాం

### మీ ధైర్యం, త్యాగం భారత్ హృదయాలలో ఎప్పటికీ సజీవం

### దేశాన్ని కాపాడే మీకు గౌరవ, మర్యాదలు, సౌకర్యాలతో జీవించేలా చేస్తాం

### ఆధునిక నిఘా పరికరాలు, అత్యాధునిక రవాణా మాధ్యమాలు, పటిష్టమైన కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలను కల్పిస్తాం

### హర్యానాలో ఐటీబీపీ జవాన్లను ఉద్దేశించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వ్యాఖ్యలు

### ఐటీబీపీ సిబ్బంది నివాస భవన సముదాయాలను ప్రారంభించిన కేంద్ర మంత్రి

### ఐటీబీపీ తెలుగు వారియర్స్ తో కేంద్ర మంత్రి ముచ్చట...







**హర్యానా వెలుతురు సెప్టెంబర్ 18:** "మంచు పాతాల ముప్పు, ఎముకలు కొరికే చలి, కనీస సౌకర్యాలు లేని చోట ఇతరులు వెళ్లడానికి కూడా భయపడే ప్రాంతాల్లో నిత్యం దేశ సేవ చేస్తున్న ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) జవాన్ల ధైర్య సాహసాలు మరువలేమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశం కోసం ఐటీబీపీ జవానుల ధైర్యం, చేస్తున్న త్యాగాలు భారతీయుల హృదయాలలో ఎప్పటికీ సజీవంగా నిలిచిపోతాయని చెప్పారు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుకునే జవాన్లకు గౌరవ మర్యాదలతోపాటు సౌకర్యాలతో జీవించేలా చేసేందుకు కేంద్రం క్రుషి చేస్తుందని పేర్కొన్నారు. గురువారం రోజున హర్యానా విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ భానులోని ఐటీబీపీ బేసిక్ ట్రైనింగ్ సెంటర్ లో 9 నివాస భవన సముదాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ప్రసంగించారు. "ఈ రోజు భారతదేశ భద్రతా వ్యవస్థకు ఆత్మగా నిలిచిన ఐటీబీపీ హిమవీరుల మధ్య, (హర్యానా)లోని భాను బేసిక్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నిలబడి మాట్లాడడం నాకు గొప్ప గర్వంగా, గౌరవంగా ఉంది. ఈ కేంద్రం ఐటీబీపీకి ముఖ్యమైన శిక్షణా కేంద్రం. ముందుగా ఈ మహా దళానికి చెందిన అమర వీరులకు నేను తల వంచి నివాళులర్పిస్తున్నాను. ఎందుకంటే వీరంతా తమ జీవితాన్ని రేపటి దేశ ప్రజల భవిష్యత్తుకోసం అర్పిస్తున్నారు. మీ పేర్లు ప్రతి పౌరునికి తెలియకపోయినా మీ త్యాగం భారత హృదయంలో శాశ్వతంగా నిలిచిపోతుంది."అని పేర్కొన్నారు. ఐటీబీపీ హిమవీరుల వీరత్వాన్ని, అంకితభావాన్ని మాటల్లో చెప్పడం కష్టమేనని, హిమవీరులు హిమాలయ పర్వతాలలో కఠినమైన పరిస్థితుల్లో సేవ చేస్తూ దేశ భద్రతను కాపాడుతున్నారని కొనియాడారు. ఈ నిబద్ధత, అజేయ ధైర్యం వల్లే భారత ప్రజలు నిశ్చింతగా ఉండగలుగుతున్నారని చెప్పారు. "ఆక్సిజన్ కొరత ఉన్న ప్రాంతాల్లో, గడ్డకట్టే చలిలో, కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుతూ సరిహద్దులను గస్తీ కాస్తున్నారు. లడఖ్ మంచు మార్గాల నుంచి అరుణాచల దట్టమైన అరణ్యాల దాకా మీరు "శౌర్య, దృఢత, కర్మనిష్ఠ" అనే నినాదానికి సజీవ ప్రతిరూపం"అని అభివర్ణించారు. దేశం కోసం పాటుపడుతున్న సైనికుల ధైర్యాల్ని ఎన్నటికీ మర్చిపోలేమని, వారి కష్టాలను విస్మరించలేమని చెప్పారు. వారికి తగిన గౌరవ మర్యాదలతోపాటు సౌకర్యాలతో జీవించేలా చేయడం కేంద్రం బాధ్యత అని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో కేంద్ర సాయుధ పోలీస్ దళాలకు ఆధునిక శిక్షణా, నిఘా పరికరాలు, అత్యాధునిక రవాణా మాధ్యమాలు, పటిష్టమైన కమ్యునికేషన్ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇదే ధైర్యం, అంకితభావంతో దేశ సేవ చేయాలని, ఈ క్రమంలో దేశసేవలో ఐటీబీపీ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రితోపాటు ఐటీబీపీ ఐజీ అశోక్ కుమార్ నేగీసహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.






### ఐటీబీపీ తెలుగు వారియర్స్ తో కేంద్ర మంత్రి ముచ్చట...

హర్యానా ఐటీబీపీ బేసిక్ ట్రైనింగ్ సెంటర్ పర్యటన లో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఐటిబిపి కానిస్టేబుల్ క్యాడర్ ట్రైనింగ్‌లో ఉన్న అభ్యర్థులను కలిశారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ఐటిబిపి కానిస్టేబుల్ ట్రైనింగ్ అభ్యర్థులతో కేంద్ర మంత్రి మాట్లాడారు. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుండి వచ్చిన ఐటిబిపి కానిస్టేబుల్ శిక్షణ అభ్యర్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సహాయం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఐటిబిపి ట్రైనింగ్ సెంటర్‌లో వరద ప్రభావం వల్ల దెబ్బతిన్న బిగుల్ వింగ్ వంతెనను మంత్రి ప్రత్యక్షంగా సందర్శించి సమీక్షించారు. మహిళా అభ్యర్థులు మొబైల్ టాయిలెట్ల అవసరం ఉందని కోరగా, వాటిని తక్షణమే ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తెలంగాణ మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులు బతుకమ్మ సందర్భంగా సెప్టెంబర్ 29, 30 తేదీల్లో బతుకమ్మ సంబరాలు జరుపుకోవడానికి అనుమతి కోరారు. వెంటనే మంత్రి అధికారులను ఆదేశించి, తెలంగాణ బతుకమ్మ పర్వదిన గొప్పతనం, విశిష్టతను వివరించి, అభ్యర్థులకు బతుకమ్మ పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.





Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com